సమగ్ర కథనాలు, ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

గురువారం
THURSDAY
19.12.2024
సంచిక: 118
సంపుటి: 16
వెల రూ.6.00
పేజీలు: 8
PAGES: 8
హైదరాబాద్
HYDERABAD

ఋషి

ధర్మం కోసం అక్షర తపస్సు తెలుగు దినపత్రిక

శ్రీకృష్ణుడి మాట

గాలి లేని చోట పెట్టిన దీపం నిశ్చలంగా ప్రకాశించునట్లే, మనో నిగ్రహం కలిగి ఆత్మయోగం అభ్యసించిన వ్యక్తి చిత్తం నిశ్చలంగా ఉంటుంది.

ముహూర్తం

గురువారం శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:44 సూర్యాస్తమయం - సా. 5:42 తిథిజి చవితి ఉ. 10:05 వరకు సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఆశ్లేష రా. 1:59o వరకు యోగం వైధృతి సా. 6:29 వరకు కరణం భాలవ ఉ. 10:05 వరకు కౌలవ రా. 10:25 వరకు వర్జ్యం మ. 2:53 నుండి సా. 4:36 వరకు దుర్ముహూర్తం ఉ. 10:23 నుండి ఉ. 11:07 వరకు మ. 2:46 నుండి మ. 3:30 వరకు రాహుకాలం మ. 1:35 నుండి మ. 2:57 వరకు యమగండం ఉ. 6:44 నుండి ఉ. 8:06 వరకు గుళికాకాలం ఉ. 9:28 నుండి ఉ. 10:51 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:08 నుండి తె. 5:56 వరకు అమృత ఘడియలు రా. 12:19 నుండి రా. 1:59 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:51 నుండి మ. 12:35 వరకు
గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published From HYDERABAD || www.rhushinews.com facebook: rhushinews twitter: rhushinews instagram: rhushinews

'జమిలి' జేపీసీ సభ్యులు వీరే..

జమిలి ఎన్నికల బిల్లు పరిశీలన కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో బీజేపీ తరపున అనురాగ్ ఠాకూర్, కాంగ్రెస్ తరపున ప్రియాంకా గాంధీ తదితరులకు చోటు కల్పించింది. పలు పార్టీలకు చెందిన 21 మంది లోక్‌సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు.

2

దమ్ముంటే ఫార్ములా-ఈ రేసింగ్‌పై సభలో చర్చ పెట్టండి..

నేను రెడీ: కేటీఆర్

2

భూకబ్జాదారులపై కఠిన చర్యలు

హైడ్రా రాకముందు కట్టడాలను కూల్చబోం

త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు: రంగనాథ్

3

అంబేద్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

పైగా అమిత్ షాపై విమర్శలా?

హస్తం పార్టీపై ప్రధాని మోదీ మండిపాటు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అవమానించారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న క్రమంలో...తాజాగా దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. అంబేడ్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు షెడ్యూల్ కులాలు, తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసిందో ప్రజలంతా చూశారని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

న్యూఢిల్లీ, డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): 'కొన్నేళ్ల పాటు కాంగ్రెస్ సాగించిన అరాచకాలు, ముఖ్యంగా అంబేద్కర్‌ను అవమానించిన తీరును ఇప్పుడు చెప్పే అబద్దాలతో వారు దాచలేరు. అలా అనుకుంటే వారు పెద్ద పొరబాటు చేసినట్లే. ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరిచేందుకు రాజవంశం నేతృత్వంలోని ఒక పార్టీ చేసిన ప్రయత్నాలను దేశ ప్రజలంతా చూశారు. మనం ఇలా ఉండటానికి అంబేద్కరే కారణం. గత దశాబ్దకాలంగా ఆయన ఆశయాన్ని నెరవేర్చేందుకు మా ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసింది. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయడం, స్వచ్ఛ భారత్, పీఎం ఆవాస్ యోజన వంటి ప్రధాన కార్యక్రమాలు ప్రతిఒక్కరికీ ఉపయోగపడ్డాయి. అంబేద్కర్‌తో అనుబంధం ఉన్న ఐదు ప్రసిద్ధ ప్రదేశాలైన పంచతీర్థాన్ని అభివృద్ధి చేసేందుకు మా ప్రభుత్వమే కృషి చేసింది. దశాబ్దాలుగా చైత్య భూమికి సంబంధించిన పెండింగ్ లో ఉన్న భూ సమస్యను మా ప్రభుత్వమే పరిష్కరించింది. నేను అక్కడ ప్రార్థనకు వెళ్లాను. అంబేద్కర్ తన చివరి ఏడాదిలో గడిపిన దిల్లీలోని 26 అలీపూర్ రోడ్డును మేము అభివృద్ధి చేశాం. లండన్ లో ఆయన నివసించిన ఇంటిని మా ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఆయన్ను సంపూర్ణంగా గౌరవిస్తుంది మేమే. పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా మాట్లాడి కాంగ్రెస్ చీకటి చరిత్రను బయటపెట్టారు. ఆయన మాట్లాడిన వాస్తవాలను చూసి వారు సైతం ఉలిక్కిపడటంతో పాటు ఆశ్చర్యపోయారు. అందుకే ఇప్పుడు వారు నాటకాలాడుతున్నారు. కానీ, ప్రజలకు నిజం తెలుసు' అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటులో షా మాట్లాడిన వీడియోను ఆయన పంచుకున్నారు. రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా అంబేద్కర్ ను ఉద్దేశిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. షా దళితులను అవమానించారంటూ కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు ఆరోపించారు.

అమిత్ షా క్షమాపణ చెప్పు

పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఆందోళన

అంబేడ్కర్ చిత్రాలతో నిరసన

న్యూఢిల్లీ, డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలంటూ ప్రతిపక్ష ఇండియా కూటమి బుధవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక సహా పలువురు ఎంపిలు ఈ నిరసనలో పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటాలతో చేబూని, జై భీమ్, అమిత్‌షా క్షమాపణలు చెప్పాల్సిందే అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ఆర్‌జెడి, డిఎంకె, ఆప్ పార్టీలు తరువాయి 2 వ పేజీలో...

రేవంత్‌కు ఆ అర్హత లేదు

గురివింద చందంగా కాంగ్రెస్ వ్యవహారం

సిఎం ధర్నా చేయడం దారుణం: కిషన్ రెడ్డి

హైదరాబాద్,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన మంత్రివర్గ సహచరులతో పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి హైదరాబాద్ రాజ్ భవన్ ముందు ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి వ్యవహారం గురివింద గింజ సామెతను తలపిస్తోందని.. అదానీ అంశంపై మాట్లాడే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదని విమర్శించారు. రూ.100 కోట్లు అదానీ కంపెనీ నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ రూపంలో తీసుకుని ఒప్పందాలు తీసుకున్నార ని.. ఎందుకోసం రూ. 100 కోట్ల సహాయం అడిగారో, ఎందుకు కలిసి ఫొటోలు దిగారో ప్రజలకు చెప్పాల్సిన తరువాయి 2 వ పేజీలో...

అదానీ అవినీతికి మోదీ ముసుగు

అదానీ అవినీతిపై జెపిసి వేయాల్సిందే.. రాజ్‌భవన్ ముందు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా

పాల్గొన్న రేవంత్, భట్టి, మంత్రులు

భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకు పోయాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లుగా దేశ ప్రతిష్ఠను పెంపొందించిందని చెప్పారు. అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారని ఆరోపించారు. ప్రపంచ దేశాల ముందు భారత్ పరువును తాకట్టుపెట్టారని ఆక్షేపించారు. అదానీని ప్రధాని వెనకేసుకుని వచ్చినా, అమెరికా మాత్రం వదలదని హెచ్చరించారు.

హైదరాబాద్,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): ఆదానీపై చర్యలకు ఢిల్లీలో కూడా ధర్నాకు వెనకాడబోమని సిఎం రేవంత్ హెచ్చరించారు. మణిపుర్ అల్లర్లు, అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ సమీపంలో సీఎం బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయి. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. దేశం పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలి. దీనిపై విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి. అదానీ అవినీతిపై చర్చ, జేపీసీ వేసేందుకు తరువాయి 2 వ పేజీలో...

వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు..!

2

అదానీకి తోడు నీడగా రేవంత్ రెడ్డి

భాయ్ భాయ్ అని వేల కోట్లు పంచుకున్న సిఎం

ఏడాది పాలనలో లక్షల కోట్ల అప్పులు చేశారు

వేములవాడ పర్యటనలో అడ్డగోలు ఖర్చులు

రేవంత్ అదానీ వ్యతిరేక ర్యాలీపై కేటీఆర్ మండిపాటు

2

అదానీకి రేవంత్ ఏజెంట్

దావోస్ వెళ్లి అదానీతో 12,400 కోట్ల అగ్రిమెంట్లు

అదానీ అవినీతి మీద నీ పోరాటం నిజమా?!

అగ్రిమెంట్లు రద్దు చేసి నిజాయితీ చాటుకో

రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చావు

మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు

కేటీఆర్, జగదీశ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి సహా ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఖాకీ దుస్తులు ధరించి ఆటోల్లో అసెంబ్లీకి వచ్చారు. కాగా ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది.

ధరణి స్థానంలో భూ భారతి

ఇక పక్కాగా రెవెన్యూ రికార్డులు.. ప్రజలకు భరోసానిచ్చేలా కొత్త చట్టం

ధరణి సమస్యలకు చెక్‌పెట్టే మార్పులు

అన్ని వర్గాలతో చర్చలు, సలహాలతో కొత్త చట్టం

వివాదాల పరిశీలనకు కొత్తగా ట్రిబ్యునల్

గ్రామానికో రెవెన్యూ అధికారి నియామకం

అసెంబ్లీలో కొత్త రెవెన్యూ బిల్లును తెచ్చిన ప్రభుత్వం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): ధరణిలో జరిగిన అవతవకలను అరికట్టి, రైతులకు న్యాయం చేయాలన్న సంకల్పంతోనే భూభారతిని తీసుకుని వస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి తెలిపారు. భేషజాలకు పోయి 'ధరణి'ని మార్చడం లేదని.. ప్రజాసమస్యల పరిష్కారానికే ఆ పోర్టల్‌ను రద్దు చేస్తున్నామని మంత్రి తరువాయి 2 వ పేజీలో...

ఋషి దినపత్రిక కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్న యువకులు 9666711515 నంబర్‌కు వాట్సాప్ ద్వారా, rhushinews@gmail.com మెయిల్‌కు బయో డేటా పంపగలరు.

అదానీకి రేవంత్ ఏజెంట్

దావోస్ వెళ్లి అదానీతో 12,400 కోట్ల అగ్రిమెంట్లు

అదానీ అవినీతి మీద నీ పోరాటం నిజమా?!

అగ్రిమెంట్లు రద్దు చేసి నిజాయితీ చాటుకో

రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చావు

మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): సీఎం రేవంత్ రెడ్డి రోడ్ల మీద చేస్తున్న సర్కస్ ఫీట్లు చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. మొదటి రోజు శాసనసభకు అదానీ, రేవంత్ అక్రమ సంబంధం మీద నిరసనగా టీషర్ట్స్ వేసుకొని వస్తే అడ్డుకున్నారు. తమను సభా ప్రాంగణంలోకి కూడా అడుగు పెట్టనివ్వలేదు. ఈ రోజు రాజ్ భవన్ వద్ద అదానీ అవినీతి గురించి మాట్లాడినట్లు రేవంత్ సర్కస్ చేసిండు. అక్కడికి వెళ్లి కూడా కేసీఆర్ గురించి, బీఆర్ఎస్ గురించే మాట్లాడిండు తప్ప, అదానీ అవినీతి గురించి మాట్లాడింది తక్కువ. మీ పోరాటం అదానీ మీద అయితే మొదటి రోజు మమ్మల్ని ఎందుకు అసెంబ్లీ రాకుండా అడ్డుకున్నావు. నిరసన తెలిపే అవకాశం కూడా ఎందుకు ఇవ్వలేదు. మేము అడుగుతున్నా ఎందుకు అసెంబ్లీలో చర్చ పెట్టడం లేదు అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు. దావోస్ వెళ్లి అదానీతో రూ. 12,400 కోట్ల అగ్రిమెంట్లు చేసుకున్నవు. నీకు నిజంగా అదానీ అవినీతి మీద పోరాటం చేయాలనుకుంటే ముందు వెంటనే అగ్రిమెంట్లు రద్దు చేయ్. నీ మాటల్లో నిజాయితీ ఉంటే, వంద కోట్లు వాపస్ ఇచ్చినట్లు రూ. 12,400 కోట్ల అగ్రిమెంట్ రద్దు చేసుకోవాలి. అగ్రిమెంట్లు రద్దు చేసి నీ చిత్తశుద్ధిని నిరూపించుకో రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు సవాల్ చేశారు. రామన్నపేటలో డ్రైపోర్టు కోసం ల్యాండ్ ఇస్తే సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చావు. అదానీ కోసం పోలీసులను పెట్టి అరెస్టులు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశావు. పోలీసు పహారా మధ్య పబ్లిక్ హియరింగ్ చేశావు. అదానీకి ఏజెంట్‌గా కొమ్ముకాస్తున్నావు. ప్రజల కోరిక మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. డైవర్షన్ పాలిటిక్స్, సర్కస్ ఫీట్లు తప్ప ఇంకేం లేదు. మీ డబుల్ స్టాండర్డ్‌కు నిదర్శనం మీ చిత్తశుద్ధి లేని పోరాటం అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అదానీ దేశ పరువు తీసిండు అని రేవంత్ రాజ్ భవన్ వద్ద అన్నడు. మరి నువ్వు దావోస్ వెళ్లి ఒప్పందాలు చేసుకొని తెలంగాణ పరువు తీశావు. అదానీకి రెడ్ కార్పెట్ వేసి రాష్ట్ర పరువు తీశావు. ఢిల్లీలో పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ పరువును తీశావు. అదానీ, రేవంత్ అక్రమ సంబంధం మీద రేపు అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. నీకు ఆ ధైర్యమే లేదు. అంతర్గతంగా ఒప్పందం మీకు ఉంది. సీఎం రాజ్ భవన్ వద్ద ట్రాఫిక్ జాం చేసిండు. ధర్నాలో పాల్గొన్న అందరి మీద నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కేసులు నమోదు చేయాలి. ధైర్యం ఉంటే, చట్టం అందరికి సమానం అయితే వారి మీద కేసులు పెట్టండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ. పదివేల కోట్లు దోచుకున్న దొంగ హరీష్ రావు అని.. ఆ అవినీతిని మేము నిరూపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి.. వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు. అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని హరీష్ రావు సూచించారు. తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్/బీఏఎంఎస్ చేసినవారికి స్థానిక కోటా పరిధిలోనే పీజీ కోర్సుల్లో అడ్మిషన్‌లు కల్పించాల్సి ఉంటుందని హైకోర్టు తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. మెడికల్ విద్యార్థులకు జరిగిన నష్టానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మెడికల్ అడ్మిషన్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వం లోకల్ కోటా నిబంధనలు స్థానికుల అవకాశాలను దెబ్బ తీస్తాయని మేము ఆనాడే చెప్పాం. ఈ రోజు కాంగ్రెస్ తెచ్చిన లోకల్ కోట నియమాలను హైకోర్ట్ రద్దు చేసింది. ఎంబీబీఎస్ అడ్మిషన్లు ఆ తప్పుడు నియమాలతో జరిగినందువలన వందల మంది స్థానిక అభ్యర్థులకు నష్టం జరిగింది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రం వెలువల చదివిన, ఇన్‌సర్వీసు అభ్యర్థులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం అడ్మిషన్‌లు కల్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. పీజీ మెడికల్, పీజీ (ఆయుష్) అడ్మిషన్‌ల నిబంధనలు 2021లోని నిబంధన 8కి సవరణ తీసుకువస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 148, 149లను కొట్టివేస్తూ మంగళవారం 106 పేజీల తీర్పును వెలువరించింది. ప్రభుత్వానికి నిబంధనలు తీసుకురావడంతోపాటు వాటిని సవరించే అధికారం ఉందని, అయితే అది చట్టానికి అనుగుణంగా ఉండాలని పేరొంది. తెలంగాణలో విద్యకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లోనే ఉన్నాయని తేల్చి చెప్పింది. స్థానిక కోటాకు పీజీ మెడికల్, పీజీ (ఆయుష్) అడ్మిషన్‌లకు సంబంధించి 2021 పీజీ మెడికల్ అడ్మిషన్‌ల నిబంధన-8కి సవరణ తీసుకువస్తూ ప్రభుత్వం అక్టోబరు 28న తీసుకువచ్చిన జీవో 148, 149లను సవాలు చేస్తూ దాదాపు 98 పిటిషన్‌లు దాఖలయ్యాయి. వీటిపై సుదీర్ఘంగా విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించడంగానీ, రద్దు చేయడంగానీ చేయలేదని అందువల్ల అన్వయించుకున్నట్టు భావించాలని ధర్మాసనం పేరొంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95 నేపథ్యంలో తెలంగాణలో రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించవన్న వాదన అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేసింది. అందువల్ల చదువులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు తెలంగాణకు వర్తిస్తాయని స్పష్టం చేసింది. మరోవైపు హరీశ్‌రావు పట్ల పోలీసులు అత్యుత్సాహం చూపించారు. శాసనసభ ప్రవేశ మార్గం వద్ద హరీశ్‌రావును ఆపిన డీఎస్పీ సుదర్శన్.. ఆయన తీసుకెళ్తున్న పేపర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. శాసనసభ ప్రవేశ మార్గం వద్ద హరీశ్‌రావును ఆపిన డీఎస్పీ సుదర్శన్.. ఆయన తీసుకెళ్తున్న పేపర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. కారు తనిఖీ పేరుతో హరీశ్‌రావు తీసుకెళ్తున్న పేపర్లను లాక్కున్నారు. డీఎస్పీ సుదర్శన్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది తీరుపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేం దుర్మార్గమంటూ పోలీసులపై మండిపడ్డారు. ఈ ఘటనపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇంతలా ఎందుకు భయపడుతుందో అర్థం కావడం లేదని అన్నారు. ప్రజా పాలనలో కంచెలు తొలగించామని అంటూనే.. పోలీసులతో అడుగడుగునా అడ్డుకుంటున్నారని విమర్శించారు. శాసనసభ ప్రవేశ మార్గంలో తనతో పోలీసులు వ్యవహరించిన తీరుపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వద్ద ఉన్న ప్లకార్డులను మండలిలోకి అనుమతించలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వద్ద ప్లకార్డులను పోలీసులు, మార్షల్స్ లాక్కుని.. వారిని లోపలికి పంపించారు. కాగా, ఆటో డ్రైవర్ల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని ఇవాళ బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఈ క్రమంలోనే కేటీఆర్, జగదీశ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి సహా ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఖాకీ దుస్తులు ధరించి ఆటోల్లో అసెంబ్లీకి వచ్చారు. కాగా ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది.

వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు..!

రేవంత్ అదానీ వ్యతిరేక ర్యాలీపై కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. ఈసారి ముఖ్యమంత్రి పాదయాత్ర విషయమై సెటైర్లు వేశారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ ఆసక్తికర పోస్ట్ చేశారు. "వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు బయలుదేరినట్టు.. అదానీకి అన్ని రకాలుగా తోడు నీడగా ఉంటూ ఆయన కోసం కష్టపడుతున్న రేవంత్.. ఇవాళ అదానీకి వ్యతిరేక ర్యాలీ తీయాలనుకుంటున్నాడు. జైపూర్ లో సరిగ్గా అతిథి మర్యాదలు జరగలేదనో.. ఢిల్లీలో అపాయింట్‌మెంట్ దక్కలేదనో.. మొత్తానికి కొత్త నాటకానికి శ్రీకారం చుట్టాడు మన చిట్టినాయుడు. భాయ్, భాయ్ అని వందల, వేల కోట్లు పంచుకున్న ముఖ్యమంత్రి.. అదానీ వ్యతిరేక ర్యాలీ తీస్తున్నాడంట. నవ్వి పోదురు నాకేటి సిగ్గు అని రేవంత్ ని చూసే రాసుంటారూ. మిమ్మల్ని ఎన్నుకున్నంత మాత్రం ప్రజలు మరీ అంత తెలివి తక్కువ వాళ్ళనుకుంటున్నావా? లేక మళ్లీ మళ్లీ మోసం చెయ్యచ్చులే అనుకుంటున్నావా? దొంగే దొంగ అనడం నేడు కామన్ అయిపోయింది" అని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదని నిప్పులు చెరిగారు. కానీ లక్షల కోట్ల అప్పులు చేశారని, ఆ పైసలు ఎక్కడ ఖర్చు పెట్టారని నిలదీశారు. అంతేకాకుండా ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటన సందర్భంగా.. సీఎం, మంత్రుల భోజనాల ఖర్చు నిమిత్తం.. ఒక్కో ప్లేటుకు రూ. 32 వేలు ఖర్చు చేసినట్లు వచ్చిన వార్తా కథనాలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అడ్డగోలు అప్పులు, ఖర్చులను కేటీఆర్ ఎండగట్టారు. ఒక్క ఇటుక పెట్టలేదు, గుప్పెడు మన్ను తియ్యలేదు.. కానీ లక్ష ఇరవై మూడు వేల కోట్ల అప్పు ఎందుకు చేశారని కేటీఆర్ ప్రశ్నించారు. అప్పు సరే కానీ భోజనాలు బాగా అయ్యాయా? అని వేములవాడ పర్యటన సందర్భంగా రేవంత్ సర్కార్ చేసిన ఖర్చును కూడా కేటీఆర్ ప్రస్తావించారు. అందరూ కడుపునిండా తిన్నారా..? తిన్నాక పాన్ వేసుకున్నారా? రూ. 32,000 ప్లేట్ భోజనం అంటే అరగాలి కదా? అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.

అమిత్ షా క్షమాపణ చెప్పు

మొదటి పేజీ తరువాయి

ఆందోళన చేపట్టాయి. మనుస్మృతిని విశ్వసించే వారు అంబేద్కర్‌తో విభేదిస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూడా అమిత్‌షాపై విరుచుకుపడ్డారు. హోం మంత్రి బాబాసాహెబ్‌ను అవమానించడం ద్వారా బిజెపి-ఆర్ఎస్ఎస్ జాతీయ పతాకానికి వ్యతిరేకమని, వారి పూర్వీకులు ఆశోక చక్రాన్ని వ్యతిరేకించారని మరోసారి రుజువైంది. భారత రాజ్యాంగానికి బదులు మనుస్మృతిని తొలిరోజు నుండే అమలు చేయాలని సంఘ్‌పరివార్ భావిస్తోందని అన్నారు. 'నాలాంటి కోట్లాది మంది ప్రజలకు అంబేద్కర్ భగవంతుడి కంటే తక్కువేమీ కాదు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులు , పేదలకు ఆయన ఎప్పటికీ గొప్పవాడేనని బిజెపి నేతలు అర్థం చేసుకోవాలి' ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. మంగళవారం రాజ్యసభలో చర్చ నేపథ్యంలో అంబేద్కర్‌ను ప్రస్తావిస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతోన్న సంగతి తెలిసిందే. హోంమంత్రి వ్యాఖ్యలను విపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అంబేద్కర్ చిత్రాలు ప్రదర్శిస్తూ పార్లమెంట్ ప్రాంగణంలో ఎంపీలు నిరసన తెలిపారు. అలాగే అమిత్ షా రాజీనామాను డిమాండ్ చేశాయి. ఆ నిరసనల్లో రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు.

రేవంత్‌కు ఆ అర్హత లేదు

మొదటి పేజీ తరువాయి

అవసరం ఉందన్నారు. వందకోట్ల రూపాయలను స్కిల్ యూనివర్సిటీకి ఖర్చు పెట్టేందుకు ఒప్పందం చేసుకున్నప్పుడు గుర్తులేదా అంటూ ప్రశ్నించారు. వందకోట్ల సహాయం ఎందుకు అడిగారు? ఎందుకు ఇస్తామన్నారు?.. ఇవన్నీ ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని సవాల్ చేస్తున్నా.. రేవంత్ అయినా రాహుల్ గాంధీ అయినా.. ఏ ప్రాతిపదికన అదానీ మీద చర్యలు తీసుకోవాలో చెప్పాలని ప్రశ్నించారు. ఒక సాక్ష్యం చూపిస్తారా అంటూ సవాల్ విసిరారు. మన మీడియా ముందు, న్యాయస్థానాల ముందు, ప్రజలముందు ఆధారాలు చూపించకుండా.. విమర్శలు చేయడం సరికాదన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఇటీవల వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో వరుసగా ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్న పార్టీ.. ఇవాళ ఫ్రస్టేషన్‌లో అదానీ మీద మాట్లాడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం పొరపాటు చేసిందని, కేంద్రం అవకతవకలకు పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ ఇవాళ నిరూపించగలదా అంటూ ప్రశ్నలు గుప్పించారు. మాటమీద నిలబడే సత్తాలేక.. ఇవాళ విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదిగా సరైన పాలన లేదని.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి మీద విచారణ లేదని కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా అన్నిరకాల వైఫల్యంతో.. 12 ఏళ్లలో రావాల్సిన ప్రజావ్యతిరేకతను 12 నెలల్లోనే కూడగట్టుకున్నారన్నారు. ఇవాళ కేంద్ర ప్రభుత్వం మీద, మోడీ మీద వ్యక్తిగత విమర్శలు చేస్తూ.. రేవంత్ రెడ్డి ధర్నా చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ వైపే ఉన్నారని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తులేనంటూ కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతే.. మళ్లీ బీఆర్ఎస్ పార్టీయే రావాలని కాంగ్రెస్ అధిష్టానం.. రేవంత్ రెడ్డిని హెచ్చరించిందా అంటూ కిషన్ రెడ్డి ఆరోపణలు చేశారు.అందుకే రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ పాట పాడుతున్నాడా అంటూ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ బొమ్మ బొరుసు లాంటి వ్యక్తులు అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దొందూ దొందే అని.. ఈ రెండు పార్టీల పాలనకు తేడా లేదని అన్నారు. ప్రజలను వంచించడంలో తెలంగాణ సంపదను దోచుకోవడంలో, కుటుంబ పరిపాలన తీసుకురావడంలో, కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి తేడా లేదని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో.. ఆ రెండు పార్టీల పనిచేసే తీరు ఒక్కటేనన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మూకుమ్మడిగా.. ప్రజాతీర్పును అగౌరవపరిచిన పార్టీలు నాడు బీఆర్ఎస్, నేడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పీఏసీ చైర్మన్‌గా, ఎంపీ అభ్యర్థిగా.. కాంగ్రెస్ నియమించడం కంటే బలమైన దోస్తీ ఉంటుందా అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా కేసీఆర్ మారిస్తే.. రేవంత్ రెడ్డి మరింత దిగజారుస్తున్నాడని వ్యాఖ్యానించారు. ఎవరు, ఎప్పుడు అప్పులిస్తారో తెలుసుకునేందుకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిన చరిత్ర రేవంత్ రెడ్డిదంటూ విమర్శించారు.

'జమిలి' జేపీసీ సభ్యులు వీరే..

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): పీపీ చౌదరి, సీఎం రమేశ్, బాన్సురీ స్వరాజ్, పురుషోత్తమ్ రూపాలా, అనురాగ్ ఠాకూర్, విష్ణు దయాళ్‌రామ్, భర్తృహరి మహ్తాబ్, సంబిత్ పాత్రా, అనిల్ బలూనీ, విష్ణుదత్ శర్మ, ప్రియాంకాగాంధీ వాద్రా, మనీశ్ తివారీ, సుఖదేవ్ భగత్, ధర్మేంద్ర యాదవ్, కల్యాణ్ బెనర్జీ, టీఎం సెల్వ గణపతి, జీఎం హరీశ్ బాలయోగి, సుప్రియా సూలే, శ్రీకాంత్ శిందే, చందన్ చౌహాన్, వల్లభనేని బాలశౌరి ఉన్నారు. వీరితో పాటు రాజ్యసభ నుంచి 10 మంది సభ్యుల పేర్లను ప్రతిపాదించారు. వారి పేర్లను ఖరారు చేశాక కమిటీ చైర్మన్‌ను కేంద్రం ప్రకటిస్తుంది. తదుపరి పార్లమెంటు సమావేశాల చివరి వారంలో ఈ కమిటీ నివేదిక సమర్పించనున్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

దమ్ముంటే ఫార్ములా-ఈ రేసింగ్‌పై శాసనసభలో

చర్చ పెట్టండి.. నేను రెడీ: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): దమ్ముంటే ఫార్ములా ఈ రేస్ అంశంపై శాసనసభలో చర్చ పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో మీ ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద, ముఖ్యంగా నా మీద అనేక నిరాధార అరోపణలు చేస్తున్నది. ఇదే విషయం మీద ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఇదే అంశం మీద కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి మీడియాకు ఇస్తున్నారు. ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా రాష్ట్ర శాసన సభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకున్నది. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకున్నది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల రూపాయల లబ్ధి చేకూరింది అని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది. 2024లో మరో దఫా రేస్ జరగవలసి ఉండగా మీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని ఏకపక్షంగా రద్దు చేయడం జరిగింది. అప్పటి నుండి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగింది అనే అపోహలు సృష్టించే ప్రయత్నం మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది అని కేటీఆర్ మండిపడ్డారు.

స్పీకర్‌కు బీఆర్ఎస్ నేతల లేఖ

ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో అసెంబ్లీలో చర్చకు అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్ లేఖ రాశారు. గత కొద్ది రోజులుగా ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొద్దినెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుపై అనేక నిరాధార ఆరోపణలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంపై ఈ వారం జరిగిన కేబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ జరిగినట్లుగా వార్తలు వచ్చాయని.. గవర్నర్ ఆమోదం వచ్చిందంటూ సీఎం కార్యాలయం నుంచి రకరకాల లీకులు మీడియాకు ఇస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై నాలుగు గోడల మధ్య చర్చ కన్నా శాసనసభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలేంటో అందరికీ తెలుస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా- ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకుందని.. ఈ రేస్తో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల లబ్ధి చేకూరినట్లుగా నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసిందని పేర్కొన్నారు. 2024లో మరో దఫా రేస్ జరగాల్సి ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిందని ఆరోపించారు. అప్పటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగింది అనే అపోహలు సృష్టించే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు.

అదానీ అవినీతికి మోదీ ముసుగు

మొదటి పేజీ తరువాయి

కేంద్రం సిద్ధంగా లేదు. అలా చేస్తే అదానీ జైలుకి వెళ్లాల్సి వస్తుంది. ఆయన్ను కాపాడేందుకు ప్రధాని మోదీ యత్నిస్తున్నారు. ఈ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. 75 ఏళ్లు కష్టపడి దేశ ప్రతిష్టను కాంగ్రెస్ పెంచితే.. ప్రధాని మోదీ, ఆయన మిత్రుడు అదానీ కలిసి దేశ పరువు తీశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ నుండి రాజ్ భవన్ వరకు కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున ర్యాలీ తీసి రాజ్ భవన్ రూట్‌లో బైఠాయించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వ్యాపారం చేసేందుకు బిలియనీర్ అదానీ లంచాలు ఇచ్చినట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు తేల్చాయి.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిలదీశారు.. కానీ ప్రధాని మోదీ దీనిపై మౌనంగా ఉంటున్నారని అన్నారు. అదానీతో ప్రధాని మోదీకి లాలూచీ ఒప్పందం ఉందని.. అందుకే అదానీ కాపాడటానికి ఆయన ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు రాజ్ భవన్ ముట్టడించామని తెలిపారు. మా పోరాటం ఇక్కడితో ఆగదని.. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రపతి భవన్ ముందు ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వమే ధర్నాలు చేయడం ఏంటని కొందరు ప్రశ్నిస్తున్నారు.. కానీ దేశ ప్రతిష్టను కాపాడుకోవడానికే రోడ్డుపై నిరసన తెలపాల్సి వచ్చిందన్నారు. పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే నిరసన చేపడుతున్నామని స్పష్టం చేశారు. విధిలేని పరిస్థితుల్లోనే మేం ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందని.. ముఖ్యమంత్రి ధర్నా చేస్తారా అని బీఆర్ఎస్ అంటోంది.. నేను ధర్నా చేయను.. మరీ వాళ్లు వచ్చి చేస్తారా అని ప్రశ్నించారు. అదానీ అంశంపై బీఆర్ఎస్ వైఖరి ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సై అంటే అసెంబ్లీలో అదానీ అంశంపై చర్చించి తీర్మానం చేస్తామని అన్నారు. ప్రధాని మోదీ ఆశీస్సులతో ఆయన మిత్రుడు, బిలియనీర్ గౌతమ్ అదానీ దేశ సంపద దోచుకుంటున్నా రని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభ

భూకబ్జాదారులపై కఠిన చర్యలు

హైడ్రా రాకముందు కట్టడాలను కూల్చబోం.. ఎఫ్‌టీఎల్‌లో అనుమతులులేని వాణిజ్య, వ్యాపార కట్టడాలు

అలా కట్టిన కట్టడాలను మాత్రం కూల్చక తప్పదు

త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు: రంగనాథ్

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): పేదలను ముందు పెట్టి చక్రం తిప్పుతున్న భూకబ్జాదారులపై కఠిన చర్యలు తప్పని హైడ్రా మరోసారి హెచ్చరించింది. పాత్రదారులు, సూత్రదారులు ఎవ్వరైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. జులై తర్వాత అనుమతి లేకుండా నిర్మించే కట్టడాలనే హైడ్రా కూల్చి వేస్తుందనే ప్రకటనతో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో స్పందించిన రంగనాథ్ ఇప్పటి వరకు హైడ్రా కూల్చివేతలకు సంబంధించిన సమగ్ర వివరణ ఇస్తూ ఆయా వివరాలను వెల్లడించారు. హైడ్రా రాకముందు అనుమతి ఇచ్చిన ఏ కట్టడాలను కూల్చబోమని, ఎఫ్ టీఎల్‌లో అనుమతి లేకుండా కట్టిన ఎన్ కన్వెన్షన్ లాంటివాటిని కూల్చక తప్పదని రంగనాథ్ పునరుద్ఘాటించారు. హైదరాబాద్ మహానగరంలో ప్రభుత్వ స్థలాలు, పార్కుల పరిరక్షణతో పాటు చెరువుల పునరుద్ధరణకు కృషి చేస్తోన్న హైడ్రాపై విమర్శలు వెల్లువెత్తున్న వేళ కమిషనర్ రంగనాథ్ స్పందించారు. హైడ్రా వెనక్కి తగ్గిదంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తూ హైడ్రా పనితీరుపై సమగ్ర వివరాలను వెల్లడించారు. హైడ్రా రాకముందు అనుమతి ఇచ్చిన ఏ కట్టడాలనూ కూల్చబోమని, అనుమతి లేకుండా కట్టిన నివాస గృహాలు జూలై 2024కి సిద్ధమై, వాటిలో నివాసం ఉంటే కూల్చదని రంగనాథ్ స్పష్టం చేశారు.ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు లేకుండా కట్టిన ఎన్ కన్వెషన్ లాంటి వాణిజ్య, వ్యాపార కట్టడాలను మాత్రం కూల్చక తప్పదన్నారు. గతంలో అనుమతులు ఇచ్చి తరువాత రద్దు చేస్తే ఆ కట్టడాలు అక్రమకట్టడాలుగా పరిగణిస్తామని వివరించిన రంగనాథ్ అనుమతులు రద్దయినప్పటికీ నిర్మాణాలు జరుగుతున్న వాటిని కూడా అక్రమ కట్టడాలుగా పరిగణలోకి తీసుకోవాల్సి వస్తుందన్నా రు.మల్లంపేట కత్వా చెరువు, అమీర్ పూర్‌లో కూల్చివేతలు అక్రమ కట్టడాల కిందకే వస్తాయన్నారు. పేదలను ముందుపెట్టి వెనుక నుంచి చక్రం తిప్పుతున్న భూ కబ్జాదారులను ఉపేక్షించేది లేదని, చింతల్, గాజులరామారం, మాదాపూర్‌లోని సున్నం చెరువులో కూల్చివేతలను కబ్జాదారుల్లో ఉన్నవేనని తెలిపారు. గడిచిన 5 నెలల్లో 12 చెరువుల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేసి దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించా రు. 12 చెరువులలో పునరుద్ధరణకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించామని, ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే పనులు మొదలుపెట్టనున్నట్లు రంగనాథ్ వివరించారు. సున్నం చెరువులో కూల్చివేతల తర్వాత కూడా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు మళ్లీ నిర్మాణాలు చేపట్టారని, వాటన్నింటిని కూల్చివేసి రాబోయే రోజుల్లో ఆ చెరువుకు ఎఫ్టీఎల్ నిర్ధారించి పునరుద్ధరణ చర్యలు చేపడతామని రంగనాథ్ వివరించారు. ప్రభుత్వ దిశానిర్దేశం మేరకే హైడ్రా పనిచేస్తుందని, వివిధ సందర్భాల్లో కోర్టులు ఇచ్చిన తీర్పునకు లోబడి హైడ్రా ముందుకెళ్తుందన్నారు. అలాగే హైడ్రాను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు అధికారాలను కట్టబెట్టిందన్న ఆయన సాంకేతికంగా కూడా హైడ్రా మరింత బలంగా తయారవుతుందన్నారు.

రేపటి నుంచి మార్కండేయ స్వామి దీక్షలు

కరీంనగర్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): శ్రీ మార్కండేయ మాలాధారణ దీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం అవుతాయని అంతర్జాతీయ శ్రీ మార్కండేయ స్వామి మాలాధారణ దీక్షా గురుస్వామి మార్గదర్శకుడు, పద్మకుల రత్న చిలుక నర్సప్ప పద్మశాలి గురుస్వామి తెలిపారు. కరీంనగర్‌లోని దేవుళ్లపురిలో ఉన్న శివభక్త మార్కండేయ దేవాలయ సంక్షేమ ట్రస్టు ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి దీక్షలు వేయనున్నట్లు వెల్లడించారు. మాఘ శుద్ధ తదియ శ్రీ మార్కండేయ స్వామి జన్మదినం (1 ఫిబ్రవరి 2025) వరకు దీక్షలు కొనసాగుతాయని, మార్కండేయ స్వామి జన్మదినం రోజునే దీక్షా విమరణ ఉంటుందని వివరించారు. వివరాలకు 9059671181, 8919473941 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

మార్చి నాటికి ట్రిపుల్ఆర్ భూసేకరణ

అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

హైదరాబాద్,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి):వచ్చే మార్చి నాటికి రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని, నాలుగేండ్లలో ఆర్ఆర్ఆర్ పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో రోడ్లను విధ్వంసం చేశారని ఆయన మండిపడ్డారు. అసెంబ్లీలో కోమటిరెడ్డి మాట్లాడుతూ 'బీఆర్ఎస్ కు రోడ్లపై అవగాహన లేదు. ఉప్పల్ పై ఓవర్ ను ఆరేండ్లు ఖాళీగా పెట్టారు. గత పాలకులకు ఎంతసేపు పైసలు వచ్చే కాళేశ్వరం తప్ప రోడ్లను పట్టించుకోలేదు. కమీషన్ తీసుకుని కూలిపోయే కాళేశ్వరం కట్టారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ కోసం నాలుగు లైన్ల రోడ్లను ఆరు వందల కోట్లతో వేసుకున్నారు. లక్ష కోట్ల విలువ చేసే ఓఆర్ఆర్ అమ్ముకున్నారని ఆరోపించారు. హరీశ్‌రావుకు దబాయించడం తప్ప పని చేయడం తెల్వదు. నేను మాట్లాడుతుండగా ఎంత రిక్వెస్ట్ చేసినా కూర్చోవడం లేదు. ఆయనకు కూలిపోయే కాళేశ్వరం కట్టి కమిషన్ తీసుకోవడం మాత్రమే తెలుసు. రోడ్లు వేయడం చాతకాదు.. కూలిపోయే ప్రాజెక్టులు కట్టారని మంత్రి మండిపడ్డారు.

శాంతిభద్రతల సమస్య సృష్టించేలా బిఆర్ఎస్: బల్మూరి

హైదరాబాద్,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి):కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే శాంతిభద్రతల సమస్య సృష్టించాలని బీఆర్ఎస్ నాయకులను రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. కేటీఆర్‌కు జైలు భయం పట్టుకుందన్నారు. అందుకే అరెస్ట్ చేస్తారని.. .జైలు కెళ్తానని కలవరిస్తున్నాడని తెలిపారు. అక్రమాలకు పాల్పడితే కేటీఆర్‌పై చట్టపరంగా ప్రజాప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఏ తప్పు చేయకపోతే పదేపదే జైలుకు వెళ్తానని ఎందుకు అంటున్నారు? తప్పు చేసినట్లు తేలితే కటకటాల పాలవుతారు. ముందు మాజీ సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీకి తీసుకురావాలి. అసెంబ్లీ చర్చలో పాల్గొనాలని బల్మూరి అన్నారు.

లైంగిక వేధింపుల కేసు
యూట్యూబర్ ప్రసాద్ బెహరా అరెస్ట్

హైదరాబాద్,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): లైంగిక వేధింపుల కేసులో ప్రముఖ యూట్యూబర్ ప్రసాద్ బెహరా ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఓ వెబ్ సిరీస్ షూటింగ్ సమయంలో హీరోయిన్‌తో అసభ్యంగా ప్రవర్తించాడనే ఆరోపణలపై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేశారు. షూటింగ్ సమయంలో తనను అందరి ముందు పలుమార్లు అసభ్య పదజాలంతో దూషించాడని, అలాగే ప్రైవేటు భాగాలను తాకాడని, చెప్పలేని పదాలతో అవమానించాడని జూబ్లీహిల్స్ పోలీసులకు బాధిత యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ప్రసాద్ బెహరాపై పలు సెక్షన్స్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. మా విడాకులు, పెళ్లి వారమండి, మెకానిక్ వెబ్ సిరీస్‌లతో నిందితుడు ప్రసాద్ బెహరా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల రిలీజైన కమిటీ కుర్రాళ్లు సినిమాతోనూ నటుడిగా మంచి గుర్తింపే వచ్చింది.

ప్రిన్సిపాల్ వైఖరి వల్ల విద్యార్థికి తీవ్ర గాయాలు

యాదాద్రి, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాల లో దారుణం చోటుచేసుకుంది. ప్రిన్సిపాల్ వంటవాళ్లకు బదులుగా విద్యార్థులను వంటపనికి వినియోగించడంతో ఓ విద్యార్థి ఒంటిపై వేడి నూనె పడింది. ఈ ఘటనలో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. సర్వేల్ గురుకుల పాఠశాలలో వంట మనుషులు సరిపడా లేకపోవడంతో విద్యార్థులను వంటపనికి వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో 8వ తరగతి విద్యార్థి వంట చేస్తూ వేడి నూను మీద పడేసుకున్నాడు. ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

టీజీ టెట్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్,డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): టీజీ టెట్2024 పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. జనవరి 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు 20 సెషన్లలో పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రతి రోజు రెండు సెషన్లు అంటే సెషన్ 1 ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, సెషన్ -2 మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పేపర్-1 పరీక్షలను జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. పేపర్ -2 పరీక్షలను జనవరి 2, 5, 11, 12, 19, 20వ తేదీల్లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జనవరి 2వ తేదీన ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో సోషల్ స్టడీస్(పేపర్-2) పరీక్ష నిర్వహించనున్నారు. జనవరి 5న ఉదయం సెషన్‌లో సోషల్ స్టడీస్(పేపర్ -2), మధ్యాహ్నం సెషన్‌లో మ్యాథమేటిక్స్ అండ్ సైన్స్(పేపర్-2) పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ ముందుచూపు లేని విధానాల వల్ల రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ తమ వాయిదా తీర్మానంలో పేర్కొంది. కాబట్టి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏటా 12వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని పేర్కొంది. అలాగే ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ.. దీనిపై అసెంబ్లీలో చర్చించాలని ప్రతిపాదించింది.

విద్యార్థులకు జరిగిన నష్టానికి బాధ్యత కాంగ్రెస్‌దే : హరీశ్

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్/బీఏఎంఎస్ చేసిన వారికి స్థానిక కోటా పరిధిలోనే పీజీ కోర్సుల్లో అడ్మిషన్‌లు కల్పించాల్సి ఉంటుందని హైకోర్టు తేల్చిచెప్పడంపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు స్పందించారు. మెడికల్ అడ్మిషన్లలో కాంగ్రెస్ ప్రభుత్వం లోకల్ కోటా నిబంధనలు స్థానికుల అవకాశాలను దెబ్బతీస్తాయని తాము ఆనాడే చెప్పామని గుర్తుచేశారు. ఈరోజు కాంగ్రెస్ తెచ్చిన లోకల్ కోటా నియమాలను హైకోర్టు రద్దు చేసిందని తెలిపారు.

ఎఫ్‌డిసి ఛైర్మన్‌గా దిల్‌రాజ్ బాధ్యతలు

అభినందనలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా దిల్‌రాజు బుధవారం ఉదయం పదవీ భాద్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్ లోని ఎఫ్.డీ.సి కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పదవీ భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమానికి హాజరై దిల్ రాజ్ ను అభినందించారు. తెలంగాణా లో ఫిలిం ఇండస్ట్రీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

కిమ్స్‌కు అల్లు అరవింద్

బాలుడు శ్రీతేజ్ ఆరోగ్యంపై ఆరా

హైదరాబాద్,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఏర్పడి రేవతి అనే మహిళ మృతి చెందగా ఆమె కొడుకు శ్రీతేజ్ ఆసపత్రిలో చికిత్స పొందుతున్నారు. తాజాగా కిమ్స్ ఆసుపత్రికి అల్లు అర్జున్ తండ్రి, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ వెళ్లారు. శ్రీ తేజ్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన ఆరా తీసినట్లుగా తెలుస్తోంది. ఆ తర్వాత శ్రీ తేజ్ కుటుంబ సభ్యులతో సైతం ఆయన మాట్లాడినట్టుగా చెబుతున్నారు.పుష్ప 2 సినిమా ప్రీమియర్ సందర్భంగా అల్లు అర్జున్ ఆ ధియేటర్ కి వెళ్లడంతో తొక్కిసలాట ఏర్పడింది. రేవతి అనే మహిళ మృతిచెందగా ఆమె కుమారుడు శ్రీ తేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ రోజు నుంచి శ్రీ తేజ్ కి హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే ఆ కుటుంబానికి అండగా ఉంటానంటూ అల్లు అర్జున్ ప్రకటించి పాతిక లక్షలు సాయం చేస్తామని వెల్లడించారు. ఇప్పటికే 10 లక్షల రూపాయలు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. అంతేకాక చికిత్సకు అవసరమైన ఒక ఇంజక్షన్ కూడా సింగపూర్ నుంచి తెప్పించినట్లుగా తెలుస్తోంది. ఇక తొక్కిసలాట కారణంగా శ్రీ తేజ్ తల్లి రేవతి మరణించింది. ఆ రోజు నుంచి శ్రీ తేజ్ ఆరోగ్య ఇబ్బందికరంగా ఉందని చెబుతున్నారు. నిన్న హైదరాబాద్ సిపి సివి ఆనంద్ తెలంగాణ హెల్త్ సెక్రటరీ క్రిస్టినాతో కలిసి శ్రీ తేజను పరమర్శించారు.

ధరిణి పేరుతో భూదందా: భట్టి

హైదరాబాద్,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి):తెలంగాణ రాష్ట్రంలో ధరణి పేరుతో పెద్దఎత్తున భూ బదలాయింపు దందా జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల పరం అయ్యాయని భట్టి ధ్వజమెత్తారు. సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములు చేతులు మారాయని ఉపముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఈ భూ దందాతో పోల్చితే కాళేశ్వరం వ్యవహారం చిన్న విషయమని ఆయన చెప్పారు. వ్యక్తిగత రెండు, మూడేళ్లపాటు ప్రతి రోజూ ఇదే చేశారని, పార్ట్-బి భూములన్ని సక్రమం చేసుకున్నారని భట్టి ఆరోపించారు. దీని మొత్తాన్ని ఫోరెన్సిక్ ఆడిట్ చేయబోతున్నట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్ పరిధిలోనే ఇలాంటి భూములు సుమారు 15 వేల ఎకరాలు ఉంటాయని అంచనా వేస్తున్నామని, అంత కంటే ఎక్కువగానే ఉండే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తల అత్యుత్సాహం

ఆగిపోయిన పెళ్లి... పెళ్లి కూతురు తల్లికి గుండెపోటు

మళ్లీ చర్చల ద్వారా జరిగిన పెళ్లి

గుంటూరు, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): కాంగ్రెస్ కార్యకర్తల అత్యుత్సాహంతో ఓ యువ ఐపీఎస్ వివాహం పెళ్లిపీటలపై ఆగిపోయింది. దీంతో పెళ్లికుమార్తె తల్లికి గుండెపోటు వచ్చింది. పెళ్లి కొడుకు ఇంటిముందు పెళ్లికూతురు బంధువులు ఆందోళన చేయగా.. చివరకు ఐపీఎస్ పెళ్లికి అంగీకరించాడు. గుంటూరు నగరానికి చెందిన ఐపీఎస్ అధికారితో తెలంగాణలోని మహబూబ్ నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కుమార్తె తో పెళ్లి నిశ్చయించారు. దీంతో డిసెంబర్ 17న సాయంత్రం గుంటూరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పెళ్లికి ఏర్పాట్లు చేశారు. అయితే ఈ పెళ్లి వేదుకకు తెలంగాణ నుంచి భారీగా కాంగ్రెస్ కార్యకర్తలు గుంటూరుకు తరలివచ్చారు. ఆ క్రమంలో పెళ్లి కుమారుడు ఇంటి నుంచి కాంగ్రెస్ జెండాలతో భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లేందుకు నాయకులు ప్రయత్నించారు. ఆ ప్రయత్నం మంచిది కాదని పార్టీ కేడర్‌ను ఐపీఎస్ బంధువులు వారించారు. అందుకు వధువు తరఫు బంధువులు ససేమిరా అన్నారు. ఈ నేపథ్యంలో వరుడు ఐపీఎస్ అధికారి కావడంతో.. పార్టీ జెండాలు మంచిది కాదంటూ.. పెళ్లి కుమార్తె బంధువులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కానీ వధువు బంధువులు అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో యువ ఐపీఎస్ అధికారి ఆగ్రహం కట్టలు తెంచుకొంది. ఈ పెళ్లి చేసుకొనేందుకు ఐపీఎస్ అధికారి నిరాకరించాడు. ఈ విషయం తెలిసి.. పెళ్లి కుమార్తె తల్లికి తీవ్ర గుండెపోటు వచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కేడర్.. ఐపీఎస్ అధికారి నివాసం వద్ద ఆందోళన చేపట్టింది. ఈ ఆందోళనపై సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. ఐపీఎస్ అధికారిని వివాహానికి ఒప్పించేందుకు.. చర్చి పెద్దలు, పాస్టర్లు చర్యలు చేపట్టారు. గత అర్ధరాత్రి 12.00 గంటల నుంచి బుధవారం ఉదయం 7.00 గంటల వరకు చర్చలు జరిగాయి. చివరకు ఈ చర్చలు ఫలప్రదమయ్యాయి. బుధవారం.. అంటే ఈ రోజు సాయంత్రం.. అదే వివాహ వేదికగా పెళ్లి ముహూర్తం ఇరు వర్గాల పెద్దలు కలిసి నిశ్చయించారు. ఈ ఐపీఎస్ అధికారి గుజరాత్ కేడర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అదీకాక.. జిల్లాలో సదరు కాంగ్రెస్ నాయకుడికి భారీగా కేడర్ ఉంది. దీంతో తమ నాయకుడు కుమార్తె వేడుకకు వారంతా గుంటూరు తరలి వచ్చారు.

లగచర్ల దాడి కేసులో ఊరట

నిందితులకు బెయిల్ మంజూరు

హైదరాబాద్,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): లగచర్లలో అధికారులపై దాడి కేసులో నిందితులందరికీ నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం బెయిల్‌ను మంజూరు చేసింది. పట్నం నరేందర్ రెడ్డితో పాటు సురేష్, మిగతా నిందితులు అందరికీ బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పట్నం నరేందర్ రెడ్డి రెండు 50 వేల ష్యూరిటీలు, మిగతా వారు 20 వేల పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. మూడు నెలల పాటు ప్రతి బుధవారం పోలీసుల ముందు విచారణ హాజరుకావాలని పట్నం నరేందర్ రెడ్డికి ఆదేశాలు జారీ చేసింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా కంపెనీ స్థాపనపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ , ఇతర రెవెన్యూ అధికారులపై స్థానికుల దాడి జరిగింది. ఈ దాడిలో అధికారులు ప్రయాణిస్తున్న వాహనాలను రాళ్లతో ధ్వంసం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన అధికారులపై దాడి జరగడంతో రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది. కాంగ్రెస్ పార్టీ ఈ ఘటన వెనుక బీఆర్ఎస్ పార్టీ హస్తం ఉందని ఆరోపించింది.

విద్యారంగం అభివృద్ధికి
చర్యలు తీసుకోవాలి: కూనంనేని

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): ఏ ప్రభుత్వానికైనా విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉంటుందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్యాలయాలను బాగు చేయాలని భారాస అధినేత కేసీఆర్‌కు మొదట్లో ఉండేదని.. ఆ తరువాత ఆయన అంచనాలు మారిపోయాయన్నారు. విద్యాలయాలు, వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనపై అసెంబ్లీలో జరిగిన స్వల్పకాల చర్చలో పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. 'విద్యా రంగాన్ని ప్రక్షాళన చేయాలనే కసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో కనిపిస్తోంది. స్కిల్స్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు నిర్ణయాలతో ఆ విషయం స్పష్టం అవుతోంది. అయితే, ముఖ్యమంత్రి ఒక్కరికే ఆ తపన ఉంటే సరిపోదు. పైనుంచి కింది స్థాయి వరకు ఆచరించాలి. ప్రభుత్వ విధానాల వల్ల ఉపాధ్యాయులు సంతోషంగా లేరు. పాఠశాల విద్యకు సంబంధించి 20వేల వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

కనిష్ఠ స్థాయికి పడిపోతున్న పరిస్థితి

మరో రెండు రోజులపాటు అధికంగా చలి తీవ్రత

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలవుతుంది. ఇక ఉదయం 10 గంటల దాకా చలి తగ్గకపోవడంతో జనాలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే గజగజ వణికిపోతున్నారు. ఉత్తరాది నుంచి వీస్తున్న చల్లటి గాలుల వల్ల రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోతున్నాయి. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్ర అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజుల పాటు చలి తీవ్రత ఇదే మాదిరి ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఈ క్రమంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మెదక్, సంగారెడ్డి, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోతాయని, ఈ జిల్లాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే అత్యల్పంగా హైదరాబాద్‌లో 6.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. చాలా చోట్ల 7 డిగ్రీల మేర కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పటాన్‌చెరులో 7 డిగ్రీలు, మెదక్‌లో 7.5 చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉపరితల ఈశాన్య దిశలో చలిగాలులు గంటకు 2 నుంచి 6 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్ లో కనిష్ఠ ఉష్ణోగ్రత 11.9 డిగ్రీల సెల్సియస్ నమోదు అయినట్లు వాతావరణ అధికారులు తెలిపారు.



అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ చేపట్టండి

మాజీ సీఎం జగన్ ముడుపుల విషయాన్ని కూడా నిగ్గులేల్చండి.. రాజ్‌భవన్ యాత్రలో వైసీపీ నేత వైఎస్ షర్మిల

అమరావతి, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ వ్యవహారంపై వెంటనే జేపీసీ ఏర్పాటు చేసి విచారణ జరపాలని మోదీ ప్రభుత్వాన్ని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అలాగే గౌతమ్ అదానీ వద్ద వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ముడుపులు తీసుకున్న వ్యవ హారంలో ఏసీబీ రంగంలోకి దింపి విచారణ చేపట్టేలా ఆదేశించాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశా రు. బుధవారం విజయవాడలో గౌతమ్ అదానీపై చర్యలు తీసుకోవాలంటూ ఏఐసీసీ పిలుపు మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో ఛలో రాజ్‌భవన్ యాత్ర చేపట్టారు. అయితే ఈ యాత్రను నగర పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల చర్య లను ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. అదానీ, వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మధ్య ముడుపుల వ్యవహారంపై నిజానిజాలు నిగ్గు తేల్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. స్వయంగా ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌కి అదానీ గ్రూప్ రూ.1,750 కోట్లు లంచం ఇచ్చారని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ నివేదిక ఇస్తే.. కేంద్రంలో మోడీ కానీ.. రాష్ట్రంలో చంద్రబాబు కనీసం నోరు విప్పడం లేదంటూ వైఎస్ షర్మిల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ సైతం జరిపించడం లేదన్నారు. అదానీ మీద ఈగ కూడా వాలనివ్వడం లేదని కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. ప్రపంచం ముంగిట దేశం పరువు, ఖ్యాతిని అదానీ తీస్తే.. ఆయన వద్ద లంచాలు తీసుకొని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆంధ్రప్రదేశ్

రాష్ట్రం పరువు తీశారని మండిపడ్డారు. స్వలాభం కోసం విద్యుత్‌ను అధిక ధరకు కొనుగోలు చేసి.. జనం నెత్తిన రూ.1.50 లక్షల కోట్ల భారం వేశారని ఆరోపించారు. ఇదో పెద్ద కుంభకోణమంటూ గతంలో తెలుగుదేశం పార్టీ తీవ్ర ఆరోపణలు చేసిందని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ప్రధాని మోదీకి, అదానీకి భయపడి టీడీపీ మౌనం పాటిస్తోందన్నారు. లంచం ఆరోపణలు వెల్లువెత్తినా.. గౌతమ్ అదానీ వ్యవహారంలో కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అందుకు నిరసనగా ఛలో రాజ్‌భవన్ కార్యక్రమం చేపట్టాలని దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఏఐసీసీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో జరిగిన ఛలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఇక పక్క రాష్ట్రం తెలంగాణలో సైతం ఛలో రాజ్ భవన్ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ సహచరులు సైతం హాజరయ్యారు.

హోంగార్డులకు హైకోర్టు బాసట

అమరావతి,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): హోంగార్డులకు ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. కానిస్టేబుళ్ల భర్తీలో హోంగార్డులను ప్రత్యేక కేటగిరీగా పరిగణించాలని హైకోర్టు తెలిపింది. ఈమేరకు స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆరు వారాల్లో ప్రత్యేక మెరిట్ జాబితా తయారీ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

నెల్లూరు జిల్లాలో బాలుడికి జికా వైరస్

వ్యాధి నిర్ధారణ కోసం పూణెకు బ్లడ్ శాంపిల్స్: ఆనం

నెల్లూరు,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలం రేపుతోంది. ఈ ఘటనపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలుడికి జికా వైరస్ సోకినట్లు ప్రచారం జరిగింది. మంత్రి ఆదేశాలతో జికా వైరస్ అనుమానాలపై జిల్లా యంత్రాంగం స్పందించింది. 'అనారోగ్యానికి గురైన బాలుడికి మెరుగైన వైద్యం అందించేందు కు అన్ని చర్యలు తీసుకున్నాం. కార్పొరేట్ వైద్యం కోసం చెన్నై తరలించాం. వ్యాధి నిర్ధరణ కోసం బాలుడి బ్లడ్ శాంపిల్స్‌ను అధికారులు పుణే ల్యాబ్‌కు పంపించారు. జీజీహెచ్ వైద్యులతో పాటు వెంకటాపురం గ్రామానికి ప్రత్యేక వైద్య బృందాలు వెళ్లాయి. బాలుడి కుటుంబ సభ్యులతో పాటు, గ్రామస్థులకు వైద్యపరీక్షలు చేస్తున్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

డమ్మీ తుపాకీతో బెదిరించి నగల చోరీ

వెంటనే పట్టుకున్న పోలీసులు

కాకినాడ,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి):జిల్లా కేంద్రమైన కాకినాడలో పట్టపగలు ఓ దొంగ హల్‌చల్ చేశాడు. నగరంలోని ఓ బంగారం షోరూమ్‌లోకి చొరబడిన దొంగ తుపాకీతో ఉద్యోగిని బెదిరించి ఆభరణాలు దోచుకెళ్లాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే స్పందించి అటవీశాఖ కార్యాలయం సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దొంగ వద్ద నుంచి తుపాకీతోపాటు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న తుపాకీ డమ్మీదని పోలీసులు తేల్చారు. దొంగను కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

నేషనల్ బేస్ బాల్ పోటీలకు అరవింద్ ఎంపిక

కడప,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): నేషనల్ బేస్ బాల్ పోటీలకు రైల్వే కోడూరు ఎస్‌వి.జూనియర్ కళాశాల విద్యార్థి మోసిన అరవింద్ ఎంపికయ్యా రని ప్రిన్సిపాల్ ఎస్ ఎన్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 14 వ తేదీ నుండి 17వరకు గుంటూరు జిల్లా నరసరావు పేటలో జరిగిన స్టేట్ లెవెల్ 68వ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్ బాల్ పోటీలలో ఎస్ వి జూనియర్ కళాశాలకు చెందిన మోసిన అరవింద్ అనే విద్యార్థి ప్రతిభ కనబరిచి 2025 జనవరి 13,14 తేదీలలో మహారాష్ట్ర లో జరిగే నేషనల్ లెవల్ బేస్ బాల్ పోటీలలో పాల్గంటారని తెలిపారు. నేషనల్ ఫెస్టివల్ కు ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపల్ ఎస్ ఎన్ శ్రీనివాసులు, డైరెక్టర్ వసుంధర, పి ఈ టి పుల్లారావు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందనలు తెలిపారు.

పరిటాల హత్య కేసులో ముద్దాయిలకు బెయిల్

అమరావతి,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): పరిటాల రవి హత్య కేసులో నిందితులకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది . ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురు ముద్దాయిలకు బుధవారం నాడు హైకోర్టు బెయి ల్ మంజూరు చేసి ఊరటనిచ్చింది. 18 ఏళ్ల తరువాత ముద్దాయిలకు హైకోర్టు ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. హత్య కేసులో బెయిల్ పొందిన నిందితుల్లో పండుగ నారాయణరెడ్డి, రేఖమయ్య, బజన రంగనాయకులు, వడ్డే కొండ, ఓబిరెడ్డి ఉన్నారు. వీరంత గురువారం నాడు జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉంది. 2005 జనవరి 24వ తేదీన అనంతపురం జిల్లా పెను కొండలో టీడీపీ నేత పరిటాల రవిని ప్రత్యర్థులు దారుణంగా హతమార్చారు.

కేంద్ర మంత్రి ప్రయాణిస్తున్న విమానం దారి మళ్లింపు

అమరావతి,డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): కేంద్ర రక్షణ సహాయ మంత్రి సంజయ్‌సేథ్ ప్రయాణిస్తున్న విమానానికి వాతావరణం అనుకూలించక పోవడంతో ముందు జాగ్రత్తగా విమానాన్ని హైదరాబాద్‌కు దారి మళ్లించారు. నౌకాదళం హైడ్రో గ్రాఫిక్ సర్వేల కోసం ఉద్దేశించిన ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌకను విశాఖ నావెల్ డాక్ యార్డ్‌లో ఉదయం జరగనున్న కార్యక్రమానికి జాతికి అంకితం చేసే కార్యక్రమానికి ఆయన విమానాశ్రయంలో బయలు దేరారు. విమానంలో సాంకేతిక లోపం ఏర్పడడంతో విమానాన్ని దారి మళ్లించడంతో కార్యక్రమాన్ని మధ్యాహ్నానికి వాయిదా వేశారు.

తెలుగోడి సాహిత్య సేవకు పట్టం

అభ్యుదయ కవి లక్ష్మీ నారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్

న్యూఢిల్లీ,డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): కేంద్ర ప్రభుతం ఉత్తమ సాహిత్యాన్ని అందించే సృజనాత్మక సాహిత్యవేత్తలకు ప్రతి సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అంద జేస్తుంది. భారతీయ సాహిత్య పురస్కారాల్లో అ త్యున్నతమైన పురస్కారంగా ప్రసిద్ధిగాంచిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ 2024 సంవ త్సరానికి గాను పలు భాషలకు చెందిన సాహితీ వేత్తల కథలు, కవితలు, సంపుటాలకు ఈ అత్యు త్తమ పురస్కారం అందుకోనున్నారు. తెలుగు భాషలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకి చెందిన ప్రముఖ కవి, న్యాయవాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ కోసం ఎంపికయ్యారు. లక్ష్మీ నారాయణ వృత్తి రీత్యా న్యాయవాది. అంతేకాదు ఆయన అభ్యుదయ కవి. శ్రామిక పక్షపాతిగా పేరు గాంచారు. ప్రస్తుతం అభ్యుదయ రచయిత ల సంఘం జాతీయ కార్యదర్శిగాను, ఆంధ్రప్రదే శ్ రాష్ట్ర అధ్యక్షుడిగాను పనిచేస్తున్నారు. 2023లో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారు. 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. వివిధ విమర్శనా గ్రంథాలను, సాహిత్యవ్యాసాల సంపుటి , కవిత్వాన్ని రచించా రు. ఇప్పటికే ఆయన తెలుగు భాషాపురస్కారం, సుంకర సత్యనారాయణ స్మారక పురస్కారం, మిలీనియం లాయర్ పురస్కారం లను అందుకున్నారు. లక్ష్మీ నారాయణ 1954, అక్టోబర్ 24వ తేదీన గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం చెరువుకొమ్ముపాలెం గ్రామంలో గోవిందరెడ్డి, లింగమ్మ దంపతులకు జన్మించా రు. మధ్యతరగతి కుటుంబం.. తండ్రి ఓ సామాన్య రైతు.. బిఎ డిగ్రీ చదివిన తర్వాత బీఎల్ చేశారు. గుంటూరులో న్యాయవాద వృత్తిని చేపట్టారు.

జల జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికీ మంచినీరు

55 లీటర్లు ఒక మనిషికి ఇచ్చేలా కార్యాచరణ: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): జల్ జీవన్ మిషన్ అమలుపై రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడు తూ... జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి పంపు, వాటి ద్వారా నాణ్యమైన మంచినీరు అందించాలనేది లక్ష్యమన్నారు. 2019 ఆగష్టులో ప్రారంభమైనప్పటికీ నీటిని అందించడానికే పరిమితం అయ్యిందని.. 2024 నాటికి మరింత బలోపేతం చేసి రోజూ నీటి సరఫరా చేయాలన్నారు. 55 లీటర్లు ఒక మనిషికి ఇచ్చేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మోడీ కలను మరింత సాకారం చేసేలా అడుగులు వేస్తున్నామన్నారు. నీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులు గుర్తించి పరిష్కారం చూస్తున్నామని.. అమృతధార ద్వారా లోపాలు, ఇబ్బందులు సరిచేసి మంచినీటిని అందిస్తామన్నారు. నేడు నీరు ఎంత ఎక్కువ తాగితే అంత మంచిది అంటున్నారని.. నీరు దొరకని సమయాల్లో మనకు ఆ విలువ ఏమిటో తెలుస్తుందన్నారు. పొలిటికల్‌గా ఆకాశం అంత పందిరి వేస్తాం అన్నట్లుగా హామీలు ఇస్తామని.. కానీ ఆచరణలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొవా ల్సి ఉందన్నారు. భీష్మ ఏకాదశిన 24 గంటలు మంచి నీళ్లు తాగకుండా ఉంటే ఆ ఇబ్బంది తెలుస్తుందన్నారు. "నేను ఈ శాఖ మంత్రిగా రివ్యూ చేస్తే... అనేక లోపాలు తెలిశాయి. ఈ పథకం అమలుకు ఒక్కో రాష్ట్రం ఒక్కో విధంగా లక్ష కోట్ల నుంచి 30 వేల కోట్ల వరకు అడిగారు. కేరళ 46 వేల కోట్లు అడిగితే.. మన ఏపీ మాత్రం 26 కోట్లే అడిగిం ది. మన రాష్ట్ర వాటా కూడా గత ప్రభుత్వం ఇవ్వక పోవడం వల్ల జల జీవన్ మిషన్ అమలు కాలేదు. నేను కేంద్ర పెద్దలతో మాట్లాడితే వారు కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యం గురించి చెప్పారు. నాలుగు వేల కోట్లను సద్వినియోగం చేయలేక పోయింది. కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా పని చేశారు. నీరు ఎలా తెస్తారో చూడకుండా పైపులు మాత్రం వేశారు. రిజర్వాయర్‌ల ద్వారా నీటిని తీసుకోవాల్సి ఉండగా.. వాటిపై దృష్టి పెట్టలేదు" అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రబాబు నాయకత్వంలో ఈ నీటి సరఫరాపై దృష్టి పెట్టామన్నారు. సీఆర్ పాటిల్ దగ్గర కూడా మన రాష్ట్రానికి రూ.76 కోట్లు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఆ ప్రాజెక్టు వివరాలు మొత్తం నివేదిక సిద్ధం చేసి జలశక్తి మంత్రికి అందజేయనున్న ట్లు చెప్పారు. "పని చేయాలనే తపన ఉన్న అధికారులు మన రాష్ట్రంలో ఉన్నారు. నేను ఎక్కడకి వెళ్లినా పైపులు వేశారు.. నీళ్లు రావడం లేదని ఫిర్యాదులు చేశారు. గత ప్రభుత్వం 70.40 లక్షల గృహాలకు ఇచ్చినట్లు చెప్పారు. దీనిపై పల్స్ సర్వే చేస్తే 55.30 లక్షల మందికి మాత్రమే నీటి కుళాయిలు పెట్టినట్లు తేలిందన్నారు. ప్రతి జిల్లాలో నీటి సరఫరాకు ఉన్న ఇబ్బందులు, వనరులు తెలుసుకునేందుకు ఈ వర్క్ షాపు ఏర్పాటు చేశాం. మోడీ కలలను సాకారం చేసేలా ప్రతి ఇంటికి మంచి నీరు అందించాలి. ప్రతి వ్యక్తికి 55 లీటర్లు ఇచ్చేలా జల జీవన్ మిషన్ ద్వారా పనులు చేయండి. మానవతా దృక్పథంతో అందరూ కలిసి పనిచేయాలి. పైపు లైన్లు డిజైన్‌లు కూడా గందరగోళంగా ఉన్నాయి. గొయ్యి తవ్వి పైప్ లైన్ వేయడం తప్ప.. నీటి సరఫరాపై గత పాలకులు దృష్టి పెట్టలేదు. వీటికి శాశ్వతమైన పరిష్కారం చూడాలి... తాగునీటిని అందించాలి" అని అన్నారు.

మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి

మంత్రి నారాయణ

రాజమండ్రి,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం రానున్న మూడేళ్లలో పూర్తి చేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారా యణ కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన ఏపీ రాజధాని అమరావతి పునఃనిర్మాణంపై వేగంగా అడుగులు వేస్తోం ది.. ఇప్పటికే అనుమతి లభించిన 45 వేల కోట్ల రూపాయల నిర్మాణాలకి కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపి.. టెండర్లు పిలవబోతున్నామని తెలిపారు. అమరావతి మొత్తం ప్రాజెక్టు వ్యయం 62 వేల కోట్ల రూపాయలు అని వెల్లడించారు. రాజమం డ్రిలో పర్యటనలో మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి.. వచ్చే ఏడాది జులైలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. గత ఆరు నెలలుగా రాష్ట్రంలోని మున్సిపాలిటీ ల్లో పరిపాలన గాడిలో పెట్టామని అన్నారు. రాజధాని అమరావతిలో రానున్న మూడేళ్లలో ఐదు ఐకానిక్ టవర్లు.. 250 మీటర్ల ఎత్తులో అసెంబ్లీ భవనం.. హైకోర్టు సహా.. అధికారుల నివాసాలు.. ట్రంక్ రోడ్లు పూర్తి చేస్తామని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. ఇక, నగర పాలక సంస్థ, ఇండియన్ ఆయిల్ కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేసి నిర్వహించనున్న ఫిల్లింగ్ స్టేషన్ ఇతర కార్పొరేషన్లకు స్ఫూర్తిదాయక మని అన్నారు మంత్రి నారాయణ.. రాజ మహేంద్రవరంలో నూతనంగా ప్రారంభిం చుకున్న పెట్రోల్ బంకును స్ఫూర్తిదాయంగా తీసుకొని.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీ పరిధిలో పెట్రోల్ బంకులు ఏర్పాటు కార్యాచరణ ప్రణాళికలు ఏర్పాటు చేయటం జరుగుతుంది. గత ప్రభుత్వం టాక్స్‌లను ఎన్నోసార్లు పెంచారు. రాజ మహేంద్రవరం నగరపాలక సంస్థకు సంబంధించి వినియోగిస్తున్న వాహనాల ఆయిల్స్ ప్రతి నెలా రూ.25.54 లక్షలు ఖర్చు చేస్తున్నాం. ఆర్ఎమ్సీ ద్వారా ఐఒసి ఎల్ సౌజన్యంతో పెట్రోల్ బంకు ఏర్పాటు వలన ఖర్చు ఆదా అవుతుంది. ఈ పెట్రోల్ బంకు నిర్మాణానికి నగరపాలక సంస్థ అందు కు అవసరమయ్యే స్థలాన్ని అందించింది. ఈ బంక్ ఏర్పాటు ద్వారా రోజుకు రు.3 లక్ష రూపాయలు టర్నోవర్ జరుగుతుందని ఈ మంత్రి నారాయణ వెల్లడించారు.

తండ్రి ఉద్యోగం కోసం సోదరులను చంపిన సోదరి

మిస్టరీని ఛేదించిన పోలీసులు

గుంటూరు, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): నకరేకల్లు డబుల్ మర్డర్ కేసులో మిస్టరీ వీడింది. విచారణ జరిపిన పోలీసులు కేసును ఛేధించారు. ప్రియుడుతో కలిసి కృష్ణవేణి పక్కా స్కెచ్ వేసింది. సుపారీ ఇచ్చి మరీ అన్నల హత్యలకు స్కెచ్ వేసింది. నిందితురాలు కృష్ణవేణితో పాటు ప్రియుడు దానయ్య మరో నలుగురు మైనర్లు హత్యలో పాల్గొన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కృష్ణవేణితో పాటు ప్రియుడు దానయ్య, మరో నలుగురు మైనర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. నవంబర్ 26వ తేదీన రామకృష్ణను ఇంట్లో చున్నీ బిగించి హత్య చేసి గొరంట్ల కాల్వ లో పడేశారు. అలాగే డిసెంబర్ 10న కానిస్టేబుల్ గోపి కృష్ణను ఇంట్లో చున్నీ బిగించి హత్య చేసి గుంటూరు బ్రాంచ్ కెనాల్ పడేశారు. బంధాలు, బాంధవ్యాలకు నేటి సమాజంలో విలువ లేకుండా పోతోంది. డబ్బే ప్రపంచంగా లోకం మారిపోతోం ది. డబ్బు, ఆస్తి కోసం ఎంత దూరం వెళ్లేందుకైనా ఏ మాత్రం ఆలోచించరు. డబ్బు ఉంటే చాలు ఇంకేది అవసరం లేదు అన్నట్లు సమాజం తయారైంది. డబ్బుల కోసం, ఉద్యోగాల కోసం ఎంతటికైనా దిగజారిపోతున్నారు. తమ మార్గానికి అడ్డు వస్తున్నారంటే అది కన్న తల్లిదండ్రులైనా, తోడబుట్టిన వారైనా వారిని అడ్డుతొలగిం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే ఎవరికి ఇష్టం ఉండదు. అనేక మంది ఎంతో కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించుకుం టారు. మరికొందరికి తండ్రి వారసత్వంగా అంటే తండ్రి హఠాత్తుగా మరణిస్తే ఉద్యోగం వస్తుంది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న తండ్రి.. సర్వీసులో ఉండి చనిపోతే కుమారులకు ఆ ఉ ద్యోగం వస్తుంది. అయితే తండ్రి ఉద్యోగం కోసం ఓ మహిళ చేయకూడని పని చేసి ఇప్పుడు వార్తల్లో నిలిచింది. తోడబుట్టువులు అని కూడా చూడాకుండా దారుణానికి పాల్పడింది. ఆమె చేసిన దారుణం చూసి పోలీసులే అవాక్కయ్యారు. ఆ తరువాత మృతదేహాలను కాల్వల్లో పడేసింది. కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో నకిరేకల్‌కు చెందిన పోలరాజు మృతి చెందాడు. పోలరాజు ఉద్యోగం కోసం కుమార్తె కృష్ణవేణి మర్డర్ స్కెచ్ వేసింది. అన్న గోపి, తమ్ముడు రామకృష్ణను హత్య చేసి మృతదేహాలను గుంటూరు బ్రాంచ్ కెనాల్, గోరంట్ల మేజర్ కాలువలో పడేసింది. ఆ తరువా త పోలీసులకు లొంగిపోయింది. ఆస్తి కోసం తోడబుట్టిన వారిని దారుణంగా హత్య చేసి కాలువలో పడేసిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. నకిరేకల్లుకు చెందిన పోలరాజు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన ప్రభుత్వ ఉద్యోగం కోసం కూతురు కృష్ణవేణి ఘాతుకానికి పాల్పడింది. తన తండ్రి ఉద్యోగం తనకు కావాలనే ఉద్దేశంతో తన తోబుట్టువులైన గోపి, రామకృష్ణలను దారుణంగా చంపేసి మృతదేహాలను కాలువల్లో పడేసింది. గోపీ.. బొల్లాపల్లి స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. రామకృష్ణ నిరుద్యోగి. అయితే వీరిద్దరికీ తండ్రి ఉద్యోగం రాకుండా.. తనకే రావాలన్న ఉద్దేశంతో ఇద్దరినీ చంపేసి గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో ఒకరిని , గోరంట్ల మేజర్ కాలువలో మరొకరిని పడేసింది. వారం రోజుల క్రితం ముప్పాళ్ల బ్రాంచ్ కెనాల్ వద్ద గుర్తుతెలియని మృతదేహం లభించిన నేపథ్యంలో ఆ మృతదేహం ఇద్దరు సోదరులలో ఒకరిదిగా పోలీసులు అనుమానించగా సోదరి మర్డర్ స్కెచ్ బయటపడింది. ఈ ఘాతుకానికి పాల్పడిన కృష్ణవేణి పోలీసుల ఎదుట లొంగిపోయి చేసిన నేరాన్ని పోలీసులకు వివరించింది. అయితే తండ్రి ఉద్యోగం కోసం ఇద్దరు సోదరులను సోదరి ఇంత కిరాతకంగా చంపేయడం నకిరేకల్ వాసులను తీవ్రంగా కలిచివేసింది.

పేర్నినాని చుట్టూ బియ్యం అక్రమాలు

బియ్యం మాయంపై దర్యాప్తు ముమ్మరం.. ఎవ్వరినీ వదలబోమంటున్న మంత్రులు

అమరావతి,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): చవక బియ్యం పథకం ఓ మాఫియాలా తయారయ్యింది. రాజకయా పార్టీల నేతలకు ఇదో ఆదాయ వనరుగా మారింది. అలాగే దీనిద్వారా వేలకోట్లు దుబారా అవుతున్నా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. రూపాయి బియ్యంతో వేలకోట్లు సంపాదిస్తున్నారు. ఎవరికి వారు దీనిపై ప్రకటనలు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు. ఈ క్రమంలో రేషన్ బియ్యం దారిమళ్లింపు కథా వ్యవహారం ఏపీ రాజకీ యాలను కుదిపేస్తోంది. పేర్నినాని కుటుంబం చుట్టూ ఇది తిరుగుతోంది. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ పట్టుబట్టడంతో వ్యవహారం మెల్లగా బయటకు వచ్చింది. చివరకు ఇది హైకోర్టులో విచారణకు వచ్చింది. తాము తప్పు చేయలేదు కాబట్టే బియ్యం మాయంపై లేఖరాశామని పేర్నినా ని ప్రకటించి ఊరుకున్నా, ఆయన దీని నుంచి తప్పించుకోలేరని అర్థం అవుతోంది. ఆయన భార్య ఇప్పటికీ అజ్ఞాతం వీడలేదు. అడ్డంగా దొరికిపో యాక బుకాయిం చడం దేనికని అధికారపార్టీ ప్రశ్నిస్తోంది. పేదల బియ్యాన్ని బుక్కినవారినెవ్వరనీ వదిలే ప్రసక్తే లేదని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్.. మరోమంత్రి హెచ్చరించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబం మెడకు రేషన్ బియ్యం వివాదం చుట్టుకుంది. మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో నాని సతీమణి పేరుతో ఉన్న గోడౌన్‌లో బియ్యం మిస్సింగ్ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. పేర్ని నాని కుటుంబానికి చెందిన గోడౌన్‌లో 187 టన్నుల రేషన్ బియ్యం మాయమయ్యాయి. అయితే, తమ గౌడౌన్‌లో మాయమైన బియ్యం ధర ఎంతో చెప్తామని కృష్ణాజిల్లా జేసీకి లేఖ రాయడం సంచలనంగా మారింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో గత నెల 28, 29 30 తేదీల్లో పౌర సరఫరాల శాఖ అధికారులు ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు చేపట్టగా 187 టన్నుల తేడా ఉన్నట్లుగా గుర్తించారు. కోటి డెబ్భై లక్షల రూపాయలు చెల్లించాలంటూ నోటీసులు పంపారు . దీంతో మాజీ మంత్రి పేర్ని నాని కోటి రూపాయల డీడీలు తీయించి ఈ నెల 14న జేసీ కార్యాలయంలో అందజేశారు. మరో 70 లక్షల రూపాయలను సోమవారం చెల్లించారు. మొత్తంగా రెండు విడతల్లో కలిపి రూ.1.7 కోట్ల డీడీలను అధికారులకు అందజేశారు. ఈ వ్యవహారంలో గోడౌన్ ఓనర్ గా ఉన్న జయసుధ పై క్రిమినల్ కేసు నమోదు చేశారు పోలీసులు దీంతో పేర్ని సతీమణి జయసుధ, తనయుడు కృష్ణమూర్తి అజ్ఞాతంలోకి వెళ్లారు. మచిలీపట్నం జిల్లా కోర్టులో జయసుధ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీని విచారణను ధర్మాసనం తిరిగి 19కు వాయిదా వేసింది. రెండు రోజులు తర్వాత పేర్నినాని అజ్ఞాతం వీడారు. సోమవారం తన ఇంటికి చేరుకోవడంతో వైసీపీ నేతలు ఆయనను పరామర్శించారు . బియ్యం లెక్కల్లో తేడాలు ఎందుకు వచ్చాయో తనకు తెలియదని పేర్ని నాని అంటున్నారు. తాము తప్పు చేయలేదు కాబట్టే బియ్యం మాయంపై లేఖరాశామని పేర్నినాని చెప్పారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సి నియామకం ప్రధానితో రాహుల్ గాంధీ భేటీ

న్యూఢిల్లీ,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): జాతీయ మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ నియామకానికి కసరత్తు మొదలయ్యింది. ఈ క్రమంలో పార్లమెంట్ ప్రాంగణంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. బుధవారం ప్రధానమంత్రి కార్యాలయంలో పీఎం మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. జాతీయ మానవహక్కుల కమిషన్ నియామకం విషయమై ఈ భేటీ జరిగింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్‌ను ఎంపిక చేసే కమిటీలో పీఎం, కేంద్ర హోంమంత్రి, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్, ఉభయ సభల్లో ప్రతిపక్ష నేతలు సభ్యులుగా ఉంటారు. అయితే ప్రస్తుతానికి మోదీ, అమిత్‌షా, ఖర్గే, రాహుల్ మధ్యే సమావేశం జరిగింది. పలు కీలక అంశాల్లో ఇలా విపక్షాలతో కలసి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

గరిష్టస్థాయికి వాణిజ్యలోటు

మోడీ విధానాలతో తిరోగమన దిశ.. ఎక్స్ వేదికగా మండిపడ్డ రాహుల్

న్యూఢిల్లీ,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): వాణిజ్య లోటు ఆల్‌టైం గరిష్ఠ స్థాయికి చేరడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మోదీ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విషయమై బుధవారం లోక్‌సభలో మోదీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బీజేపీ ప్రభుత్వం చట్టపరంగా జరిగే వ్యాపారాల పట్ల పారదర్శకంగా వ్యవహరించట్లేదని మండిపడ్డారు. 'ప్లే-ఫెయిర్'కంటే క్రోనీ వ్యాపారాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల దేశ ఆర్థికవ్యవస్థకు నష్టం కలుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తయారీ రంగం బలహీన పడుతోందని, ఇదివరకెన్నడూ లేనివిధంగా కరెన్సీ విలువ క్షీణిస్తోందని అన్నారు. పదేళ్లుగా మోదీ ప్రభుత్వం చేపడుతున్న చర్యల కారణంగానే దేశంలో రికార్డు స్థాయిలో వాణిజ్య లోటు నమోదయ్యిందని ఆందోళన వెలిబుచ్చారు. వాణిజ్య లోటు, దిగుమతులు గతంలో ఎన్నడూ లేనంతగా నమోదయ్యాయని ఒక మీడియా కథనాన్ని ఎక్స్‌లో ట్యాగ్ చేస్తూ నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ విరుచుకుపడ్డారు. దేశంలో రికార్డు స్థాయిలో వాణిజ్య లోటు, దిగుమతులు నమోదవడంపై సోషల్‌మీడియా వేదికగా స్పందించారు. మోదీ ప్రభుత్వం దేశం కోసం కాక సన్నిహిత వ్యాపారులకు మేలు చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకోవడం వల్లే వాణిజ్య లోటు ఆల్‌టైం హైకి చేరిందని విమర్శలు గుప్పించారు. మోదీ ప్రభుత్వం 'ప్లే-ఫెయిర్'వ్యాపారాలను ప్రోత్సహించడానికి బదులుగా క్రోనీ బిజినెస్‌లను ప్రోత్సహిస్తే ఇలా కాక ఇంకెలా జరుగుతుందని వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. ఇదే తరహా విధానాలు కొనసాగిస్తే తయారీ రంగం పూర్తిగా దెబ్బతిని కరెన్సీ విలువ బలహీనపడుతుందని మండిపడ్డారు. రికార్డు వాణిజ్య లోటు కారణంగా వడ్డీరేట్లు తారాస్థాయికి చేరుతాయని, వస్తువుల వినియోగం తగ్గి ద్రవ్యోల్బణం పెరగడం చూస్తామని సోషల్‌మీడియా వేదికగా పేర్కొన్నారు. అక్టోబర్‌లో రెండంకెల వృద్ధిని నమోదు చేసిన ఎగుమతుల రంగం నవంబర్ నెలలోకి అడుగుపెట్టే సరికి చతికిలపడింది. పసిడి దిగుమతులు గణనీయంగా పెరగడం వల్లే.. వాణిజ్య లోటు ఆల్‌టైం గరిష్ఠ స్థాయిని తాకిందని వాణిజ్య శాఖ వర్గాలు చెబుతుండగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించకుండా, చట్ట ప్రకారం జరిగే వ్యాపారాలను పట్టించుకోకుండా, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ అవలంభించే ఇటువంటి చర్యల ఫలితంగా దేశంలో తయారీ రంగం బలహీనపడుతోందని, కరెన్సీ విలువ పడిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రికార్డు స్థాయిలో గరిష్ఠ వాణిజ్య లోటు,అధిక వడ్డీ రేట్లు పెరుగుతాయని తెలిపారు. ఈకారణంగా వస్తువుల వినియోగం తగ్గి ద్రవ్యోల్బణం పెరుగుదల వంటివన్నీ చూస్తామని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. దేశంలో వాణిజ్య లోటు, దిగుమతులు గతంలో ఎన్నడూ లేనంతగా ఉన్నాయని వస్తున్న వార్తా కథనాలను ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. పసిడి దిగుమతులు గత నెలలో రికార్డు గరిష్ఠమైన 14.86 బిలియన్ డాలర్లకు చేరాయి. 2023 నవంబరులో పసిడి దిగుమతులు 3.44 బిలియన్ డాలర్లతో పోలిస్తే, ఇవి 4 రెట్లు అధికం. విలువ పరంగా చూస్తే ఏడాది వ్యవధిలో 331శాతం పెరగడం గమనార్హం. ఏప్రిల్-నవంబరులో పసిడి దిగుమతులు 49 బిలియన్ డాలర్లకు చేరాయి. 2023లో దిగుమతులు 32.93 బిలియన్ డాలర్లతో పోలిస్తే, ఇవి అధికం. వంట నూనె, ఎరువులు, వెండి అధిక ఇన్‌బౌండ్ షిప్‌మెంట్ల కారణంగా దిగుమతులు సంవత్సరానికి 27శాతం పెరిగి రికార్డు స్థాయిలో 69.95 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

రాజస్తాన్‌లో మందుగుండు పేలుడు

ఇద్దరు జవాన్లు మృతి

జైపూర్,డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): రాజస్థాన్ బికనీర్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు మందగుండు పేలడంతో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ నార్త్ క్యాంప్ ఆర్టిలరీ ప్రాక్టీస్ సమయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకున్నది. ఈ పేలుడులో ఇద్దరు జవాన్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో సైనికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే సూరత్‌గఢ్‌లోని మిలటరీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సైనిక విన్యాసాల జరుగుతున్న ఫైరింగ్ రేంజ్‌లోని చార్లీ సెంటర్‌లో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న సైనికాధికారులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. మహాజన్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ కశ్యప్ సింగ్ ప్రమాదాన్ని ధ్రువీకరించారు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ లో ఆర్మీ ప్రాక్టీస్ కొనసాగుతోందని కశ్యప్ సింగ్ తెలిపారు. ట్యాంక్‌లోకి మందుగుండును ఎక్కిస్తున్న సమయంలో పేలుడు చోటు చేసుకున్నది. మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో వారం వ్యవధిలో సైనికులు ప్రాణాలు కోల్పోవడం ఇది రెండో ఘటన. ఈ నెల 15న ట్రైనింగ్ సమయంలో ఓ సైనికుడు వీరమరణం పొందాడు. చంద్ర ప్రకాష్ పటేల్ టోయింగ్ వాహనానికి తుపాకీని అటాచ్ చేస్తున్నప్పుడు, తుపాకీ గన్ మౌంట్ ర్యాంప్‌పై ట్రాక్షన్ కోల్పోయి వెనుక్కు జారింది. దాంతో జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఫీల్డ్ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు అప్పటికే చనిపోయినట్లుగా తెలిపారు.

ఆప్ మరో ఉచిత హామీ

సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్య సేవలు అందిస్తాం
ఆప్ అధినేత కేజ్రీవాల్ ప్రకటన

న్యూఢిల్లీ,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): ఇప్పటికే అనేక ఉచిత హామీలతో అదరగొడుతున్న ఆప్ అధినేత కేజ్రీవాల్ మరో హామీ గుప్పించారు. వచ్చే ఏడాది దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఆప్ కీలక హామీ ప్రకటించింది. దిల్లీలోని సీనియర్ సిటిజన్లు అందరికి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చింది. మరోసారి ఆప్ అధికారంలోకి వస్తే 60 ఏళ్లు దాటిన వృద్ధులందరికీ ఉచిత వైద్యం అందించేలా 'సంజీవని యోజన' అమలు చేస్తామని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్ తెలిపారు. 'వయో వృద్ధుల సంరక్షణ మా బాధ్యత. మీరెంతో కష్టపడి పనిచేసి దేశాన్ని ముందుకు తీసుకొచ్చారు' అన్నారు. సీనియర్ సిటిజన్లు అనారోగ్యానికి గురైతే వారి చికిత్సకు అయ్యే ఖర్చుకు గరిష్ఠ పరిమితి ఏమీ ఉండదని కేజీవ్రాల్ తెలిపారు. దీనిపై ఒకట్రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ పక్రియ మొదలవుతుందని.. ఆప్ కార్యకర్తలే ఇళ్లకు వచ్చి రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. వారు ఇచ్చే కార్డును జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో తాము అధికారంలోకి రాగానే.. ఈ ఉచిత చికిత్స విధానాన్ని అమలు చేస్తామన్నారు. మరోవైపు, దిల్లీ ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ వారంలోనే సమావేశం నిర్వహించనుంది. ఈ క్రమంలో త్వరలోనే ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆప్ 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆప్ చీఫ్ కేజీవ్రాల్ న్యూదిల్లీ నుంచి పోటీ చేయనున్నారు.. సీఎం ఆతిశీ కల్కాజీ సీటు నుంచి బరిలో నిలవనున్నారు.

రూ. 22,280 కోట్ల విలువైన మాల్యా, చోక్సీ ప్రాపర్టీలు సీజ్ : నిర్మలాసీతారామన్

న్యూఢిల్లీ,డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి):ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన విచారణలో భాగంగా అనేక కేసులకు సంబంధించిన ప్రాపర్టీలను సీజ్ చేసి అటాచ్ చేసింది. ఆర్థిక నేరాలకు లింకున్న ఆ ప్రాపర్టీలను స్వాధీనం చేసుకున్నారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి సీతారామన్ బదులిస్తూ.. విజయవంతంగా ఈడీ సుమారు 22,280 కోట్ల విలువైన ప్రాపర్టీలను సీజ్ చేసినట్లు చెప్పారు. దీంట్లో విజయ్ మాల్యాకు చెందిన 14,131.6 కోట్లు ఆస్తి ఉన్నట్లు తెలిపారు. ఇక నీరవ్ మోదీ కేసులో 1,052.5 కోట్ల ఆస్తుల్ని బ్యాంకులు జప్తు చేసుకున్నట్లు చెప్పారు. నేషనల్ స్పాట్ ఎక్స్‌చేంజ్ స్కామ్‌లో 17.47 కోట్లు బ్యాంకులు సీజ్ చేశాయన్నారు. ఎస్ఆర్ఎస్ గ్రూపుకు చెందిన 20.15 కోట్లు, రోజ్ వాలీ గ్రూపుకు చెందిన 19.40 కోట్లు, సూర్య ఫార్మసీకి చెందిన 185.13 కోట్లు, నౌషేరా షేక్ గ్రూపుకు చెందిన 226 కోట్లు, నాయుడు అమృతేశ్ రెడ్డికి చెందిన 12.73 కోట్ల ప్రాపర్టీలను బ్యాంకులు స్వాధీనం చేసుకున్నాయి. మోహుల్ చోక్సీకి చెందిన 2,565.90 కోట్ల విలువైన ప్రాపర్టీలను బ్యాంకులు స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

భారత్,అమెరికాలది బలమైన బంధం

అధ్యక్షుడు బైడెన్ బృందం వ్యాఖ్యలు
భారత్ పన్నుల భారంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు

వాషింగ్టన్,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్న రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్.. మరోసారి భారత్ 'సుంకాల' అంశాన్ని ప్రస్తావిస్తూ..అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అమెరికా ఉత్పత్తులపై న్యూదిల్లీ అత్యధిక టారిఫ్‌లు వసూలు చేస్తోందని ఆరోపించారు. దీనికి ప్రతీకార పన్ను తప్పదంటూ మళ్లీ హెచ్చరికలు చేశారు. ఫ్లోరిడాలోని తన ఎస్టేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదిలాఉండగా.. భారత్, అమెరికా సంబంధాలపై ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ యంత్రాంగం కీలక వ్యాఖ్యలు చేసింది. బైడెన్ పాలనలో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడిందని పేర్కొంది. ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా దీన్ని కొనసాగించాలని ఆశాభావం వ్యక్తంచేసింది. భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రాతో భేటీ సందర్భంగా అమెరికా విదేశాంగశాఖ డిప్యూటీ సెక్రటరీ కర్ట్ కాంప్‌బెల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'అమెరికా ఉత్పత్తులపై భారత్, బ్రెజిల్ వంటి దేశాలు అత్యధిక టారిఫ్‌లు విధిస్తున్నాయి. 100, 200శాతం పన్నులు వేస్తున్నాయి. దేనికైనా ప్రతిచర్య ఉంటుంది. వాళ్లు మాపై పన్నులు విధిస్తే మేమూ అంతేస్థాయిలో పన్నులు వసూలు చేస్తాం. ఒకవేళ భారత్ 100శాతం పన్నులు విధిస్తే మేము వారిపై అలాగే ఛార్జ్ చేయకూడదా? ఆయా దేశాలు సుంకాలు వసూలుచేయడం అనేది వారి ఇష్టమే. కానీ, మేం కూడా అలాగే స్పందిస్తాం' అని ట్రంప్ వివరించారు. ఎన్నికలకు ముందు కూడా ట్రంప్ పలుమార్లు సుంకాల అంశంపై ఇదేతరహా వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

28న చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం

మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలసి కిషన్ రెడ్డి రాక.. రూ.430 కోట్లతో అత్యాధునిక సౌకర్యాల కల్పన

హైదరాబాద్,డిసెంబర్18 (ఋషి ప్రతినిధి): ఆధునీకరించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ఈనెల 28న రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు. దీంతో ఇది మహానగరం సిగలో మరో మణిహారం కానుంది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సుమారు రూ.430 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ టెర్మినల్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈ స్టేషన్ భవనంలో ఆరు ఎస్కలేటర్లు, ఏడు లిఫ్ట్‌లు, ఆరు బుకింగ్ కౌంటర్లు, పురుషులు, మహిళలకు వేర్వేరు వెయిటింగ్ హాళ్లు, హైక్లాస్ వెయిటింగ్ ఏరియా ఉంది. మొదటి అంతస్తులో కెఫెటేరియా, రెస్టారంట్, రెస్ట్‌రూమ్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కొత్త డిజైన్‌లో ప్రయాణికుల రాకపోకలకు విశాలమైన స్థలం (కాన్కోర్స్), ముందువైపు ప్రకాశవంతమైన లైటింగ్‌తో ఆధునిక ఎలివేషన్‌ను తీర్చిదిద్దారు. హైదరాబాద్ శివారులోని ఈ టెర్మినల్ అందుబాటులోకి వచ్చాక.. పలు రైళ్లు ఇక్కడి నుంచే ప్రారంభం కానున్నాయి. తద్వారా జంటనగరాల్లోని ప్రధాన రైల్వేస్టేషన్లపై ఒత్తిడి తగ్గించాలనేది రైల్వే శాఖ లక్ష్యం.ఈ టెర్మినల్ అందుబాటులోకి వచ్చాక నగరంలోని నాంపల్లి, కాచిగూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లపై ప్రయాణికుల ఒత్తిడి గణనీయంగా తగ్గిపోనుంది. ఇక్కడి నుంచే నగరం నలుమూలలకు ప్రయాణికులు సులువుగా చేరుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే నడుస్తున్న రైళ్లకు అదనంగా కొత్తగా మరో 25 జతల రైళ్లు ఇక్కడి నుంచి పరుగుల తీయనున్నాయి. లక్షల్లో ప్రయాణికులు రాకపోకలు సాగించనున్నారు.

మూసీ ప్రాజెక్టుపై తప్పుడు లెక్కలు

ప్రపంచ బ్యాంకు ముందు మోకరిల్లుతున్న రేవంత్ : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు సమాధానాలు చెబుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. పదేండ్లలో బీఆర్ఎస్ హయాంలో రుణం కోసం ఏనాడూ ప్రపంచ బ్యాంకును ఆశ్రయించలేదని పేర్కొన్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ప్రపంచ బ్యాంకు ముందు మోకరిల్లుతున్నారని విమర్శించారు. ఈ మేరకు మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై కల్వకుంట్ల కవిత కీలక విషయాలను బయటపెట్టారు. మూసీ పరివాహక ప్రాంతంలో పేద ప్రజల నుంచి భూములు లాక్కొని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టి రియల్ ఎస్టేట్ చేయాలని అనుకుంటున్నారని కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఈ మేరకు ప్రపంచ బ్యాంకుకు సెప్టెంబర్ 19వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించిందని అన్నారు. ఆ ప్రతిపాదనల్లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అని స్పష్టంగా రాసి ఉందని తెలిపారు. కానీ మంత్రి శ్రీధర్‌బాబు మాత్రం మూసీ ప్రాజెక్టు కాదు.. మురుగునీటి శుద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణాన్ని కోరామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై ప్రభుత్వం తప్పుడు సమాధానాలు చెబుతోందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను, హైదరాబాద్‌ను ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ బ్యాంకు ముందు రేవంత్ రెడ్డి మోకరిల్లుతున్నారని ధ్వజమెత్తారు. మూసీ పరివాహక ప్రాంతంలో పేద ప్రజల నుంచి భూములు లాక్కొని ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెట్టి రియల్ ఎస్టేట్ చేయాలని అనుకుంటున్నారని స్పష్టం చేశారు. "ప్రపంచ బ్యాంకుకు కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 19న ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది.

పంజాబీ రైతుల రైల్ రోకో

చండీఘడ్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): పంజాబీ రైతులు రైల్ రోకో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఛలో ఢిల్లీ ప్రయత్నం విఫలం కావడంతో.. ఆ రైతులు ఇప్పుడు రైళ్లను ఆపేస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు రైళ్లను నిలిపివేశారు. రాష్ట్రంలోని అనేక మార్గాల్లో మూడు గంటల పాటు రైల్ రోకో నిర్వహించారు. పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని రైతులు ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. సంయుక్త కిసాన్ మోర్చాతో పాటు కిసాన్ మజ్దూర్ మోర్చాలు రైల్ రోకో నినాదాన్ని ఇచ్చాయి. రైల్వే ట్రాకులపై రైతులు బైఠాయించినట్లు కిసాన్ మజ్దూర్ మోర్చా నేత సర్వాన్ సింగ్ పందేర్ తెలిపారు. ఢిల్లీ మార్చును అడ్డుకోవడంతో ఫిబ్రవరి 13వ తేదీ నుంచి శంభూ, కన్నౌరి బోర్డర్ల మధ్య రైతులు ధర్నా చేపడుతున్న విషయం తెలిసిందే. కన్నౌరి బోర్డర్ పాయింట్ వద్ద పంజాబీ రైతు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆమరణ దీక్ష చేపడుతున్నారు. పంటలకు ఎంఎస్పీ ఇవ్వాలని కేంద్రాన్ని రైతులు డిమాండ్ చేస్తున్నారు. 101 మంది రైతులు డిసెంబర్ 6,8, 14వ తేదీల్లో ఢిల్లీలో ప్రవేశించేందుకు ప్రయత్నించారు. కానీ ఆ ప్రయత్నాలను హర్యానా భద్రతా దళాలు అడ్డుకున్నాయి. పంటలకు ఎంఎస్పీతో పాటు రుణమాఫీ, పెన్షన్, విద్యుత్తు ధరల తగ్గింపు, పోలీసు కేసులు ఎత్తివేత లాంటి డిమాండ్లపై రైతులు పోరాడుతున్నారు.

జమ్ముకశ్మీర్‌లో అగ్ని ప్రమాదం.. ఆరుగురి మృతి

శ్రీనగర్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): జమ్ముకశ్మీర్‌లోని కథువాలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శివనగర్‌లోని ఓ ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇల్లంతా దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో ఊపిరాడక ఆరుగురు మరణించారు. మరో ముగ్గురు అపస్మారకస్థితిలోకి వెళ్లారు. వారిని చికిత్స నిమిత్తం కథువాలోని జీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, అగ్ని ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పివేసే ప్రయత్నం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఇంటికి మంటలు అంటుకున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

ఫ్యూచర్ సిటీ రవాణా కోసం కార్యాచరణ

ఔటర్ తరహాలో 40 కిలోమీటర్ల మేర నిర్మాణం
తొలి దశలో 458 ఎకరాలు సేకరణకు నోటిఫికేషన్?
భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఋషి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ(భావి నగరాని)కి రవాణా సౌకర్యాల కోసం అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ఫ్యూచర్ సిటీకి చేరుకునేలా ఔటర్ తరహాలో 330 అడుగుల రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా రిజినల్? రింగ్?రోడ్డు వరకు 40 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించడంతోపాటు వెయ్యి ఎకరాల ప్రైవేటు భూములను అధికారులు సేకరించనున్నారు. ఈ సందర్భగా తొలి దశలో 458 ఎకరాలు సేకరణకు నోటిఫికేషన్? జారీ చేశారు. కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా ప్రాంతీయ రింగ్‌రోడ్డుకు నిర్మిస్తున్న రహదారి శంషాబాద్ విమానాశ్రయంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి సులభంగా చేరుకునేలా ఉంటుందని వివరిస్తున్నారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, రహదారులు, భవనాలశాఖ అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. శంషాబాద్ – పెద్దఅంబర్‌పేట్ ఔటర్ ఎగ్జిట్ నంబర్ 13 వద్ద కొంగరకలాన్ నుంచి మీర్‌ఖాన్‌పేట్‌లోని ఫ్యూచర్‌సిటీకి, అక్కడి నుంచి ఆమన్‌గల్ మండలం ఆకుతోటపల్లి వద్ద రీజనల్‌రింగ్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ రోడ్డు అందుబాటులోకి రానుంది.

రాజాసాబ్ షూటింగ్ పూర్తి

గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంపౌండ్ నుంచి హారర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న చిత్రం రాజాసాబ్. మారుతి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారని తెలిసిందే. సినిమా షూటింగ్‌కు సంబంధించి అభిమానుల్లో నెలకొన్న డైలామాకు చెక్ పెట్టాడు మారుతి. ఈ డైరెక్టర్ బచ్చలమల్లి ప్రమోషనల్ ఈవెంట్‌లో రాజాసాబ్ షూటింగ్ పూర్తయిందని క్లారిటీ ఇచ్చేశాడు. అయితే రాజాసాబ్ అనుకున్న సమయానికి రావడం లేదన్న వార్త ఒకటి మూవీ లవర్స్‌ను నిరాశ చెందేలా చేస్తుంది. రాజాసాబ్ విడుదల వాయిదా పడిందని వార్తలు వస్తుండగా.. మరోవైపు మీరు ఏ డేట్‌కు చూడాలనుకుంటే బాగుంటదో అదే తేదీన రాజాసాబ్ వస్తుందని మారుతి చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరి రాజాసాబ్ విడుదలపై మేకర్స్ నుంచి అధికారికంగా ఏదైనా ప్రకటన వస్తుందేమో చూడాలి. అంతేకాదు రాజాసాబ్ టీజర్ రన్‌టైం 2 నిమిషాల 15 సెకన్లు అని ఇన్‌సైడ్ టాక్. రాజాసాబ్ మోషన్ పోస్టర్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రంలో మలబారు సోయగం మాళవిక మోహనన్, ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. బాలీవుడ్ యాక్టర్ సంజయ్ దత్ కీ రోల్ పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

ఒజీలో డీజే టిల్లు భామ నేహాశెట్టి

టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న మోస్ట్ క్రేజీయెస్ట్ సినిమా ఓజీ. సుజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఇప్పటికే షూటింగ్‌కు సంబంధించిన స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. ఈ చిత్రంలో స్పెషల్ సాంగ్ ఉండబోతుందట.. ఈ పాటలో డీజే టిల్లు భామ నేహాశెట్టి మెస్మరైజ్ చేయబోతుందట. పవన్ కల్యాణ్‌తో నేహాశెట్టి స్టెప్పులేయబోతుందన్న వార్తలపై ప్రస్తుతానికి అధికారిక ప్రకటన ఏం రాకున్నా.. ఈ అప్‌డేట్‌ను మాత్రం ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు మూలీ లవర్స్ అండ్ ఫ్యాన్స్. ఈ చిత్రంలో గ్యాంగ్ లీడర్ ఫేం ప్రియాంకా ఆరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రియారెడ్డి కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య తెరకెక్కిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన ఓజీ గ్లింప్స్.. పవన్ కల్యాణ్ పూర్తిగా నయా అవతార్‌లో చూపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు. ఈ చిత్రంలో పాపులర్ జపనీస్ నటుడు కజుకి కిటముర, ప్రముఖ థాయ్ యాక్టర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

నాగచైతన్య, సాయిపల్లవి శివతండవం

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం తండేల్. చందూ మొండేటి డైరెక్షన్‌లో రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని 2025 ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఇప్పటికే విడుదల చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా తండేల్ సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు మేకర్స్. శివశక్తి ఫుల్ సాంగ్‌ను డిసెంబర్ 22న తెలుగు, హిందీ, తమిళ భాషల్లో విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. చైతూ, సాయిపల్లవి శివతాండవం చూపించబోతున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోంది తండేల్. ఈ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

మానవ గాత్రంతోనే సాధ్యం: రమణ గోగుల

స్వరకర్తగా, గాయకుడిగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడు రమణ గోగుల. కెరీర్‌లో ఎన్నో సూపర్‌హిట్ ఆల్బమ్స్ అందించిన ఆయన గత కొన్నేళ్లుగా ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆయన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో 'గోదారి గట్టు..' అనే గీతాన్ని ఆలపించారు. ఈ పాట మ్యూజిక్ చార్ట్స్‌లో అగ్రభాగాన కొనసాగుతున్నది. ఇప్పటికే 27 మిలియన్ల వ్యూస్‌ను దక్కించుకుంది. వెంకటేష్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'సంక్రాంతికి వస్తున్నాం' జనవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా రమణ గోగుల పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'నేను యూఎస్‌లో ఉంటున్నా. వ్యక్తిగత జీవితంలో బిజీ కావడం వల్ల ఇండస్ట్రీకి దూరంగా ఉన్నా. నేను యూఎస్‌లో ఉన్నప్పుడు చిత్ర సంగీత దర్శకుడు భీమ్స్ కాల్ చేసి తప్పకుండా పాట పాడాలని కోరాడు.సాంగ్ పంపిస్తే రెండుసార్లు విన్నా. చాలా బాగా నచ్చింది. అందులో కొత్తదనంతో పాటు మంచి ఫీల్ ఉందనిపించింది. దాంతో తప్పకుండా పాడాలని నిర్ణయించుకున్నా' అన్నారు. చాలా మంది ఫోన్ చేసి పాట బాగుందని, వాయిస్‌లో అదే మ్యాజిక్ ఉందని పొగడటం ఆనందంగా ఉందని, వెంకటేష్ కూడా ఫోన్ చేసి పాట గురించి మెచ్చుకున్నారని రమణ గోగుల తెలిపారు. మళ్లీ మ్యూజిక్ డైరెక్షన్ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, తన వద్ద వినూత్నమైన ఐడియాస్ ఉన్నాయని, మంచి కథ, దర్శకుడు కాంబినేషన్ సెట్ అయితే తప్పకుండా కంపోజింగ్‌కు సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. టెక్నాలజీ వల్ల మ్యూజిక్ కంపోజింగ్‌లో మార్పులొచ్చాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సింగర్ అవసరం లేకుండా పాటను తయారుచేయొచ్చని, అయితే పాట తాలూకు ఆత్మ ఆవిష్కృతం కావాలంటే మావన గాత్రంతోనే సాధ్యమని రమణ గోగుల అభిప్రాయపడ్డారు. విదేశాల్లో మల్టీనేషనల్ కంపెనీల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటా ఎనలిటిక్స్ ప్రాజెక్ట్స్‌లో బిజీగా ఉండటం వల్ల సినిమాలకు గ్యాప్ వచ్చిందని ఆయన వివరించారు.



వరుస సినిమాలతో అజిత్‌కుమార్

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తున్న విదాముయార్చి. ఏకే 62గా వస్తోన్న ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. 2025 జనవరిలో పొంగళ్ కానుకంగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. మేకర్స్ నుంచి విడుదల తేదీపై క్లారిటీ రావాల్సి ఉంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త స్టిల్స్ రూపంలో బయటకు వచ్చింది. విదాముయార్చి షూటింగ్ చివరి దశలో ఉంది. అజిత్ కుమార్ స్టైలిష్ సూట్‌లో ఉండగా.. త్రిష చీరకట్టులో స్టైలిష్ గాగుల్స్ పెట్టుకొని మెస్మరైజ్ చేస్తోంది. ఈ క్రేజీ స్టార్లు అందమైన లొకేషన్‌లో చిరునవ్వులు చిందిస్తూ నడుచుకుంటూ వస్తున్న స్టిల్‌తోపాటు లొకేషన్‌లో దిగిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకీ ఈ షూట్ లొకేషన్ ఎక్కడనేది తెలియాల్సి ఉంది. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీలో యాక్షన్ కింగ్ అర్జున్ సార్జా కీలక పాత్ర పోషిస్తుండగా.. బాలీవుడ్ స్టార్ హీరో సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. విదాముయార్చి పోస్టర్లు ఇప్పటికే నెట్టింట చక్కర్లు కొడుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో ఆరవ్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. అజిత్ కుమార్ మరోవైపు అధిక్ రవిచంద్రన్ డైరెక్షన్‌లో ఏకే 63ను కూడా చేస్తుండగా.. గుడ్ బ్యాడ్ అగ్లీ టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది.

టాలీవుడ్ యాక్టర్ సిద్ధు జొన్నలగడ్డ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ క్రేజీ యాక్టర్ నటిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటి జాక్. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ 37గా వస్తోంది. మేకర్స్ తాజాగా విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చారు. ప్రభాస్ నటిస్తోన్న రాజాసాబ్‌ను 2025 ఏప్రిల్ 10న విడుదల చేస్తున్నట్టు ప్రకటించగా.. రిలీజ్ వాయిదా పడుతుందంటూ వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జాక్ సినిమాను ఇదే తేదీన విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. తాజా లుక్‌లో నిర్మానుష్య ప్రదేశంలో ఓ వైపు జీపు కనిపిస్తుండగా.. మరోవైపు గన్‌ను చూడొచ్చు. రాజాసాబ్ తేదీన వస్తుండటంతో సూపర్ బజ్ క్రియేట్ అవడం పక్కా అని అర్థమవుతోంది. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

అచితూచి సంయుక్త మీనన్ సినిమాలు

ఇండస్ట్రీలో 90శాతం సక్సెస్ రేట్ ఉన్న కథానాయిక సంయుక్త మీనన్. రాశి కన్నా వాసి ముఖ్యమన్నట్టు ఆచితూచి సినిమాలను ఎంచుకుంటూ ముందుకెళ్తున్నది ఈ మలయాళ మందారం. ప్రస్తుతం సౌత్‌లో అన్ని భాషలూ కలిపి ఓ అరడజను సినిమాలు ఈ అమ్మాయి చేతిలో ఉన్నాయి. ఇదిలావుంటే.. ఇటీవలే ఓ తెలుగు సినిమాకు ఈ ముద్దుగుమ్మ పచ్చజెండా ఊపేసిందట. పైగా అది లేడీ ఓరియెంటెడ్ సినిమా అని సమాచారం. రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ చిత్రానికి యోగి దర్శకుడు. ఈ సినిమాకు 'రాక్షసి' అనే టైటిల్‌ని అనుకుంటున్నారట. ఫిల్మ్‌ఛాంబర్‌లో ఈ టైటిల్‌ని రిజిస్టర్ కూడా చేయించినట్టు తెలుస్తున్నది. ఇందులో సంయుక్త పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని వినికిడి. పేరుకు తగ్గట్టే వైల్డ్‌గా ఈ పాత్ర బిహేవ్ చేస్తుందట. అందుకే ఈ కథకు 'రాక్షసి' అనే టైటిల్ అనుకుంటున్నారు. ఈ సినిమా నిర్మాణంలో కూడా సంయుక్త భాగస్వామిగా ఉంటారని తెలుస్తున్నది.

అంతర్జాతీయ క్రికెట్‌కు అశ్విన్ గుడ్‌బై

అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు

టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్ట్ అనంతరం అశ్విన్ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. మ్యాచ్ అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న అశ్విన్.. తన 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు తెలిపాడు. ఈ సమయంలో అశ్విన్ కాస్త భావోద్వేగానికి గురయ్యాడు. "అంతర్జాతీయ స్థాయిలో అన్ని ఫార్మాట్లలో భారత క్రికెటర్‌గా ఇదే నా చివరి రోజు. ఒక క్రికెటర్‌గా నాలో ఇంకా కొంచెం శక్తి ఉంది. అయితే అది క్లబ్ స్థాయి క్రికెట్‌లో ఉపయోగించుంటా. నేను చాలా సరదాగా గడిపాను. రోహిత్ శర్మతోపాట సహచరుల అందరితో మంచి జ్ఞాపకాలు ఉన్నాయి. కొద్దిరోజులుగా కొందరు సహచరులను మిస్ అయ్యాను. నేను కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన వ్యక్తులు చాలా మంది ఉన్నారు. ఈ క్రికెట్ ప్రయాణంలో భాగమైన కోచ్‌లందరూ, ముఖ్యంగా రోహిత్, విరాట్, అజింక్యా, పుజారా అద్భుతమైన క్యాచ్‌లను అందుకుని.. నాకు వికెట్ల సంఖ్యను అందించారు. అలాగే గట్టి పోటీదారుగా ఉన్న ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు ధన్యవాదాలు. నేను ఆసీస్‌తో మ్యాచ్‌లను ఎంతో ఎంజాయ్ చేశాను." అని అశ్విన్ చెప్పుకొచ్చాడు. పెర్త్ టెస్ట్ విజయం తర్వాతే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాలనుకున్నాడని, కానీ తానే పింక్ బాల్ టెస్ట్ ఆడేలా కన్విన్స్ చేసానని కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. అశ్విన్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నామని, తదుపరి రెండు టెస్ట్‌లు అతను ఆడడని వెల్లడించాడు. గురువారమే అశ్విన్ స్వదేశానికి వెళ్లిపోతాడని స్పష్టం చేశాడు. 2010 శ్రీలంక పర్యటనలో హరారే వేదికగా జరిగిన వన్డే మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన అశ్విన్.. అడిలైడ్ వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్‌తో చివరి మ్యాచ్ ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి అశ్విన్ 765 వికెట్లు తీసాడు. టెస్ట్‌ల్లో 106 మ్యాచ్‌ల్లో 2.83 ఎకానమీతో 537 వికెట్లు పడగొట్టాడు. ఇందులో 5 వికెట్ల ఘనతను 37 సార్లు అందుకున్నాడు. 116 వన్డేల్లో 4.93 ఎకానమీతో 156 వికెట్లుత తీసాడు. 65 టీ20ల్లో 6.90 ఎకానమీతో 72 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి 4, 400 పరుగులు చేశాడు. 106 టెస్ట్‌ల్లో 25.75 సగటుతో 3503 పరుగులు చేసిన్ అశ్విన్.. 6 సెంచరీలతో పాటు 14 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. అంతకుముందు డ్రెస్సింగ్ రూమ్‌లో విరాట్ కోహ్లీతో అశ్విన్ భావోద్వేగానికి గురైన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

1	ముత్తయ్య మురళీధరన్ (శ్రీలంక)	133	230	800
2	షేన్ వార్న్ (ఆస్ట్రేలియా)	145	273	708
3	జేమ్స్ ఆండర్సన్ (ఇంగ్లండ్)	188	350	704
4	అనిల్ కుంబ్లే (ఇండియా)	132	236	619
5	స్టువర్ట్ బ్రాడ్ (ఇంగ్లండ్)	167	309	604
6	గ్లెన్ మెక్‌గ్రాత్ (ఆస్ట్రేలియా)	124	243	563
7	రవిచంద్రన్ అశ్విన్ (ఇండియా)	106	200	537
8	నాథన్ లియోన్ (ఆస్ట్రేలియా)	132	246	533
9	కోర్ట్నీ వాల్ష్ (వెస్టిండీస్)	132	242	519
10	డేల్ స్టెయిన్ (సౌతాఫ్రికా)	93	171	439

గట్టెక్కిన టీమిండియా!

గబ్బా టెస్ట్ డ్రా.. కాపాడిన వర్షం

260 పరుగులకు ఆలౌటైన భారత్

89/7 స్కోర్ వద్ద ఆసీస్ డిక్లేర్

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ గమనాన్ని తేల్చే గబ్బా టెస్ట్‌లో టీమిండియా ఓటమి నుంచి గట్టెక్కింది. టెయిలెండర్ల అసాధారణ ప్రదర్శనకు వర్షం తోడవ్వడంతో ఈ మ్యాచ్ ఫలితం లేకుండా ముగిసింది. 275 పరుగుల లక్ష్యంతో భారత్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించగా.. వర్షం అంతరాయం కలిగించింది. వర్షం తీవ్రత పెరగడంతో అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. దాంతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. మొత్తం మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు ఆధిపత్యం ప్రదర్శించినా నాలుగో, చివరి రోజు మాత్రం టీమిండియా అద్భుత ఆటతీరును ప్రదర్శించిందనడంలో సందేహం లేదు. ఆస్ట్రేలియా టీమిండియాకు కేవలం 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. గత పర్యటనలో ఆస్ట్రేలియాపై ఇదే మైదానంలో 328 పరుగుల స్కోరును ఛేదించిన టీమిండియా రికార్డు సృష్టించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి కూడా ఈ స్కోరును ఛేదించడం సాధ్యమనిపించింది. అయితే, వర్షం ఆస్ట్రేలియాను కాపాడినట్లు అంతా భావిస్తున్నారు. ఎందుకంటే గబ్బా మైదానంలో టీమిండియాకు అనుకూలమైన చరిత్ర ఉంది. అంతకుముందు 252/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఐదో రోజు ఆటను ప్రారంభించిన భారత్.. మరో 8 పరుగులను జోడించి 260 పరుగులకు ఆలౌటైంది. ట్రావిస్ హెడ్ బౌలింగ్‌లో ఆకాశ్ దీప్(44 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 31)ఆఖరి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. జస్‌ప్రీత్ బుమ్రా(10 నాటౌట్) అజేయంగా నిలిచాడు. దాంతో ఆసీస్‌కు 185 పరుగుల ఆధిక్యం లభించింది. భారీ లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్.. 89/7 స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. జస్‌ప్రీత్ బుమ్రా(3/18), ఆకాశ్ దీప్(2/28), మహమ్మద్ సిరాజ్(2/38) నిప్పులు చెరగడంతో ఆసీస్ 85 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో నాథన్ మెక్‌స్వీనీ(4), ఉస్మాన్ ఖవాజా(8), మార్నస్ లబుషేన్(1), మిచెల్ మార్ష్(2), స్టీవ్ స్మిత్(4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ట్రావిస్ హెడ్(17), అలెక్స్ క్యారీ(19 నాటౌట్), ప్యాట్ కమిన్స్ (22)లు డబుల్ డిజిట్ స్కోర్ చేశారు. ఈ మ్యాచ్‌లో ఎలాగైన ఫలితం రాబట్టాలనే ఉద్దేశంతో ఆసీస్.. భారత్ ముందు 275 పరుగుల ఊరించే లక్ష్యాన్ని ఉంచింది. కానీ ఆసీస్ ఆశలపై వరణుడు నీళ్లు చల్లాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 పరుగుల భారీ స్కోర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో శతకంతో చెలరేగిన ట్రావిస్ హెడ్(160 బంతుల్లో 18 ఫోర్లతో 152)కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ఆసీస్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. విజయం దిశగా సాగిన ఆ జట్టు ఆశలపై వరణుడు నీళ్లు చల్లాడు. ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా అసాధారణ బ్యాటింగ్‌తో ఈ మ్యాచ్‌లో టీమిండియా ఫాలో ఆన్ తప్పించుకుంది. ఈ ఇద్దరూ ఆఖరి వికెట్‌కు 47 పరుగులు జోడించారు. టీమిండియా ఫాలో ఆన్ గండం గట్టెక్కకుంటే ఈ మ్యాచ్‌లో ఆసీస్ విజయం సాధించేది.

కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా అసాధారణ బ్యాటింగ్

ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా అద్భుతమైన పోరాటం

అందుకే ఓటమి తప్పించుకున్నాం: రోహిత్ శర్మ

కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా అసాధారణ బ్యాటింగ్‌తో పాటు ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా అద్భుతమైన పోరాటంతో ఓటమి తప్పించుకున్నామని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. మూడో టెస్ట్ అనంతరం అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన రోహిత్ శర్మ.. ఓటమి తప్పించిన ఆటగాళ్లపై ప్రశంసల జల్లు కురిపించాడు. పదే పదే వర్షం అంతరాయం కలిగించడం చికాకు పెట్టిందన్నాడు. 'పదే పదే వర్షం అంతరాయం కలిగించడం చికాకు పెట్టింది. కానీ ఈ మ్యాచ్‌లో ఓటమి తప్పించుకొని 1-1తో మెల్ బోర్న్ వెళ్లడం గొప్ప విషయం. ఈ మ్యాచ్ డ్రాగా ముగియడంతో మా ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. మెల్‌బోర్న్‌లో రాణించగలమనే విశ్వాసాన్ని ఇచ్చింది.

హెడ్‌ను తగిన బుద్ధి చెప్పిన ఆకాష్‌దీప్

గబ్బా వేదికగా జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టులో టీమ్ ఇండియా బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఆకాశ్‌దీప్ చేసిన పని వ్యాఖ్యాతలను కూడా నవ్వించేలా చేసింది. బ్యాటింగ్ చేస్తున్న భారత ఫాస్ట్ బౌలర్ ఆకాశ్‌దీప్.. పక్కనే ఉన్న ట్రావిస్ హెడ్‌కి బంతి ఇవ్వకుండా మైదానంలో పడేశాడు. దీనికి ట్రావిస్ హెడ్ కోపంగా చూస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత, ఆకాష్.. అలెక్స్ కారీకి సారీ చెప్పడం కనిపించింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న గబ్బా టెస్టు ఐదో రోజు తొలి సెషన్‌లో ఈ దృశ్యం కనిపించింది. టీమిండియా తొమ్మిది వికెట్లు కోల్పోయింది. జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాష్‌దీప్ చివరి వికెట్‌గా క్రీజులో ఉన్నారు. ఆకాష్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో.. ఓ బంతిని ఆడడం మిస్ అయ్యాడు. ఆ బంతి బ్యాట్‌కు తగిలి ప్యాడ్‌లో ఇరుక్కుపోయింది. సమీపంలో ఫీల్డింగ్ చేస్తున్న హెడ్ ఆకాష్ బంతిని తీసుకోవడానికి వచ్చాడు. ఆకాష్ ప్యాడ్ నుంచి బంతిని తీసివేస్తున్న సమయంలో.. ఆపై హెడ్ బంతిని అడిగాడు. కానీ, బంతిని హెడ్‌కి ఇవ్వకుండా, ఆకాష్ దానిని నేలపై విసిరాడు. ఆ తర్వాత, హెడ్ అతని వైపు చూస్తూ, బంతిని స్వయంగా తీయడం ప్రారంభించాడు. అప్పుడు ఆకాష్ వికెట్ కీపర్ అలెక్స్ కారీకి 'ఐ యామ్ సారీ' అని చెప్పుకొచ్చాడు.

ఆసక్తిగా ప్లే ఆఫ్స్ సమరం

హర్యానాపై యూపీ యోధాస్ విజయం

తెలుగు టైటాన్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం

ఏడో స్థానానికి పడిపోయిన తెలుగు టైటాన్స్

ప్రోకబడ్డీ ప్రీమియర్ లీగ్(పీకేఎల్) సీజన్ 11 తుది దశకు చేరుకుంది. ఒక్కో మ్యాచ్ ఫలితంతో ప్లే ఆఫ్స్ సమరం ఆసక్తిగా మారుతోంది. ఇప్పటికే హర్యానా స్టీలర్స్, దబాంగ్ ఢిల్లీ ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకోగా.. మరో రెండు స్థానాల కోసం యూపీ యోధాస్, పట్నా పైరేట్స్, జైపూర్ పింక్ పాంథర్స్, యు ముంబా, తెలుగు టైటాన్స్ పోటీ పడుతున్నాయి. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ యోధాస్ 31-24తో టేబుల్ టాపర్ హర్యానా స్టీలర్స్‌ను ఓడించి తమ ప్లే ఆఫ్స్ అవకాశాలను మెరుగుపురుచుకుంది. 20 మ్యాచ్‌ల్లో 11 విజయాలు, 3 టైలతో మూడో స్థానంలో నిలిచిన యూపీ యోధాస్.. ప్లే ఆఫ్స్‌కు మరో అడుగు దూరంలో నిలిచింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో యూపీ తరఫున భవానీ రాజ్‌పుత్(11) సత్తాచాటాడు. ఫస్టాఫ్‌లో ఇరు జట్లు నువ్వా నేనా అన్నట్లు తలపడ్డాయి. హర్యానాను ఆలౌట్ చేసిన యూపీ యోధాస్ 15-13 తేడాతో ఆధిక్యం సాధించింది. సెకండాఫ్‌లో మరింత జోరు కనబర్చిన యూపీ యోధాస్.. మరోసారి హర్యానాను ఆలౌట్ చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. హర్యానా తరఫున విశాల్, వినయ్ 6 పాయింట్స్‌తో రాణించారు.

యూపీ యోధాస్ విజయంతో తెలుగు టైటాన్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. యూపీ యోధాస్ విజయంతో తెలుగు టైటాన్స్ 6వ స్థానం నుంచి ఏడో స్థానానికి పడిపోయింది. తెలుగు టైటాన్స్ 20 మ్యాచ్‌ల్లో 11 విజయాలు సాధించింది. మరో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ప్లే ఆఫ్స్ చేరాలంటే ఈ మూడింటికి మూడు గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు మ్యాచ్‌లు గెలిస్తే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. నేడు తెలుగు టైటాన్స్ పట్నా పైరేట్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే ప్లే ఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. మంగళవారం జరిగిన మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 35-26 తేడాతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. ఈ గెలుపుతో జైపూర్ ప్లే ఆఫ్స్ అవకాశాలు కూడా మెరుగయ్యాయి.

నేను జస్సీ భాయ్‌ని మాత్రమే నమ్ముతాను

సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు

ఆస్ట్రేలియాతో జరిగిన బ్రిస్బేన్ టెస్ట్‌లో విలేఖరి ప్రశ్నకు జస్‌ప్రీత్ బుమ్రా చమత్కార సమాధానం నెట్టింట్లో వైరల్ అయింది. 2022లో బుమ్రా ఒక టెస్ట్ ఓవర్‌లో 35 పరుగులు చేసిన ఘనతను గుర్తుచేస్తూ, "నా బ్యాటింగ్ గురించి గూగుల్ చూడండి" అని చమత్కరించాడు. బుమ్రా తన అద్భుతమైన ప్రదర్శనతో జట్టుకు కీలకమైన ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియాలో భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మూడో టెస్ట్ మ్యాచ్ బ్రిస్బేన్‌లో మూడో రోజు ముగిసిన తర్వాత జస్‌ప్రీత్ బుమ్రా అందించిన సమాధానం నెట్టింట్లో విపరీతంగా వైరల్ అయ్యింది. విలేఖరి అడిగిన ఒక గమ్మత్తైన ప్రశ్నకు బుమ్రా చమత్కారమైన సమాధానం ఇవ్వడమే ఇందుకు కారణం. జస్‌ప్రీత్, మీ బ్యాటింగ్ సామర్థ్యం గురించి, గబ్బా పరిస్థితులలో జట్టు పరిస్థితి గురించి మీ అభిప్రాయం ఏంటి అని ఒక విలేఖరి ప్రశ్నించాడు. దీనికి బుమ్రా నవ్వుతూ "మీరు నా బ్యాటింగ్ సామర్థ్యాన్ని ప్రశ్నిస్తున్నట్లుగా అనిపిస్తోంది. నా బ్యాటింగ్ రికార్డు గురించి తెలుసుకోవాలంటే మీరు గూగుల్ ని అడగండి. ఒక టెస్ట్ ఓవర్‌లో ఎవరు ఎక్కువ పరుగులు సాధించారో చూడండి" అని బుమ్రా సమాధానం ఇచ్చారు. ఆ సమాధానం వెనుక అర్థం స్పష్టమైనది. 2022లో ఇంగ్లండ్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ బౌలింగ్‌లో బుమ్రా ఒకే ఓవర్లో 35 పరుగులు చేసి, టెస్ట్ క్రికెట్‌లో ఒక రికార్డు సృష్టించాడు. బుమ్రా చమత్కారం అంతటితో ఆగలేదు. ఈ సందర్భాన్ని గూగుల్ ఇండియా కూడా లైట్‌గా తీసుకుని ట్విట్టర్‌లో స్పందించింది. గూగుల్ ఇండియా ఒక వీడియో క్లిప్ పోస్ట్ చేస్తూ "నేను జస్సీ భాయ్‌ని మాత్రమే నమ్ముతాను" అని రాసింది. అయితే, కేవలం చమత్కారాలకు మాత్రమే పరిమితం కాకుండా, బుమ్రా తన ప్రదర్శనతో భారత జట్టుకు ఎంత నిస్వార్థంగా సహాయం చేస్తున్నాడో మరోసారి చూపించాడు. బ్రిస్బేన్ టెస్ట్‌లో 18 వికెట్లతో టెస్ట్ సిరీస్‌లో అతను వికెట్ తీయడం కొనసాగిస్తూ అగ్రస్థానంలో నిలిచాడు. ప్రతి మ్యాచ్‌లో సవాళ్లను ఎదుర్కొంటూ, పరిస్థితులను అర్థం చేసుకొని తన బౌలింగ్‌ను మెరుగుపరుచుకోవడం బుమ్రా ప్రత్యేకతగా చెప్పుకోవాలి. జస్‌ప్రీత్ బుమ్రా ఇలా కేవలం ఒక బౌలర్‌గా మాత్రమే కాకుండా, ఆపత్కాలంలో జట్టును నిలబెట్టే ఆటగాడిగా మారాడు. ప్రతిసారి తన ప్రదర్శనతో జట్టును ముందుండి నడిపే బుమ్రా, భారత జట్టుకు నిజమైన ఆస్తిగా కొనసాగుతున్నాడు. అతని చమత్కారాలు, అద్భుతమైన ఆటతీరు అభిమానులకు ఎప్పటికీ ఆనందం తెచ్చేలా ఉన్నాయి.

చరిత్ర సృష్టించిన జస్‌ప్రీత్ బుమ్రా

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ ఆల్‌టైమ్ రికార్డ్‌ను బుమ్రా అధిగమించాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో జస్‌ప్రీత్ బుమ్రా ఈ ఫీట్ సాధించాడు. ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా(8), మార్నస్ లబుషేన్(1)లను ఔట్ చేయడం ద్వారా బుమ్రా ఈ ఘనతను అందుకున్నాడు. ఖవాజాను స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేసిన బుమ్రా.. మార్నస్ లబుషేన్‌ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆసీస్ గడ్డపై కపిల్ దేవ్ 11 టెస్ట్‌ల్లో 51 వికెట్లు తీయగా.. జస్‌ప్రీత్ బుమ్రా 10 టెస్ట్‌ల్లో 52 వికెట్లు తీసి ఈ ఫీట్ సాధించాడు. ఈ జాబితాలో బుమ్రా, కపిల్ దేవ్ తర్వాత అనిల్ కుంబ్లే(49), రవిచంద్రన్ అశ్విన్(40), బిషన్ సింగ్ బేడీ(35) ఉన్నారు. ఇరు జట్ల మధ్య జరిగిన టెస్ట్‌ల్లో అత్యధిక వికెట్లు తీసిన ఘనత మాత్రం ఆసీస్ స్పిన్నర్ నాథన్ లయన్ పేరిట ఉంది. నాథన్ లయన్ 18 టెస్ట్‌ల్లో 63 వికెట్లు తీసాడు. అతనికి చేరువగా అశ్విన్ ఉన్నాడు. ఇక గబ్బా టెస్ట్ అనేక మలుపులు తిరుగుతోంది. ఓవైపు వర్షం.. మరోవైపు భారత బౌలర్ల అసాధారణ ప్రదర్శన అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. టెయిలెండర్ల అసాధారణ బ్యాటింగ్‌తో ఫాలో ఆన్ గండం గట్టెక్కిన భారత్.. బౌలింగ్‌లో నిప్పులు చెరుగుతోంది.

1943లోనే

భారత ప్రధానిగా బోస్

భారత తొలి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ ప్రమాణం చేయటానికి నాలుగేళ్ల ముందే నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత ప్రధాని అయ్యారు. 1943లో అక్టోబరు 21న నేతాజీ సారథ్యంలో సింగపూర్ వేదికగా భారత తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరింది. అయితే, అప్పటికి వారి చేతిలో ఉన్న భారత భూభాగం.. అండమాన్ నికోబార్ దీవి మాత్రమే! రెండో ప్రపంచయుద్ధం చివరి రోజులు.. జర్మనీ, జపాన్, బ్రిటన్ మధ్య పోరు ప్రభావం భారత్‌పై పడుతున్న దశ.. భారత్‌లో బ్రిటిష్ చెర నుంచి తప్పించుకుని వెళ్లిన నేతాజీ సుభాష్ చంద్రబోస్.. జపాన్, జర్మనీ సహకారంతో సాయుధ మార్గంలో భారత్‌ను విముక్తం చేయాలని భావించారు. ఆ క్రమంలో ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేశారు. బర్మా, సింగపూర్‌లాంటి చోట్ల ఓడిపోయి జపాన్ చేతికి చిక్కిన బ్రిటన్ సైన్యంలోని భారతీయ సిపాయిలు బోస్ సైన్యంలో చేరారు. వీరికి జపాన్, బర్మా, మలేసియా తదితర దేశాల్లోని భారతీయులు కూడా తోడయ్యారు. బలూచిస్థాన్ నుంచి మొదలెట్టి.. దక్షిణభారతం దాకా అన్ని ప్రాంతాలవారితో సుమారు 50 వేల మందితో ఐఎన్ఏ ఓ భారత సమాహారంగా రూపుదిద్దుకుంది. ఝాన్సీ పేరిట ఏర్పాటైన రెజిమెంట్‌లో భారీసంఖ్యలో మహిళలు కూడా చేరారు. సింగపూర్‌ను జపాన్ గెల్చుకోవటంతో బోస్ కార్యకలాపాలకు ఆ దేశం వేదికైంది. జపాన్ ప్రభుత్వ మద్దతుతో 1943 అక్టోబరు 21న నేతాజీ.. సింగపూర్ కాథీ థియేటర్‌లో ఆర్జి హుకూమత్ ఎ ఆజాద్ హింద్ (స్వతంత్ర భారత తాత్కాలిక ప్రభుత్వం)ను ఏర్పాటు చేశారు. బోస్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయగా.. లెఫ్టినెంట్ కర్నల్ ఏసీ ఛటర్జీ ఆర్థికమంత్రిగా, లక్ష్మీస్వామినాథన్ మహిళా వ్యవహారాల మంత్రిగా ప్రమాణం చేశారు. గాంధీజీ చరఖా గల త్రివర్ణ పతాకాన్ని తమ పతాకంగా ప్రకటించారు. సబ్ సుఖ్ చయన్ (జనగణమనకు ఉర్దూ అనువాదం) జాతీయగీతంగా, జైహింద్‌ను నినాదంగా నిర్ణయించారు. తొలి తరం విప్లవవాది రాస్ బిహారీ బోస్ ప్రభుత్వానికి సలహాదారుగా నియమితులయ్యారు. భారత్‌ను బ్రిటన్ నుంచి విముక్తం చేయటానికి విదేశీ గడ్డపై ఏర్పడ్డ తాత్కాలిక ప్రభుత్వమిది. అండమాన్ నికోబార్ దీవులపై తప్పిస్తే భారత్‌లోని ఏ ప్రాంతంపైనా దీనికి అధికారం లేదు. అండమాన్ నికోబార్‌ను బ్రిటన్ నుంచి జపాన్ గెల్చుకొని.. నేతాజీకి అప్పగించింది.

ప్రభుత్వ ఏర్పాటు తరువాత నేతాజీ.. ఛలో ఢిల్లీకి పిలుపునిచ్చారు. భారత్‌లోని బ్రిటన్ ప్రభుత్వంపై ఇంఫాల్-కోహిమా సెక్టార్‌లో కూడా జపాన్ సేనలతో కలసి ఐఎన్ఏ పోరాడింది. కొన్ని విజయాలు.. కొన్ని వెనకడుగులతో సాగిన ఐఎన్ఏ యాత్ర తన లక్ష్యాన్ని నేరుగా సాధించకున్నా.. పరోక్షంగా బ్రిటన్ ప్రభుత్వ గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. తమ పక్షాన పోరాడుతున్న భారత సైనికులకు నమ్మలేని పరిస్థితి కల్పించింది. ఎక్కడ తిరుగుబాటు తలెత్తుతుందోననే ఆందోళన వారిలో రోజురోజుకూ ఎక్కువైంది. భారత్‌ను ఇక ఎక్కువరోజు పాలించలేమనే భావన బ్రిటన్ మదిలో బలంగా నాటడంలో ఐఎన్ఏ సఫలమైంది.

- గంగాధర్ వూరడి

కష్టాలైనా, సుఖాలైనా,
చీకటి అయినా, వెలుతురు
అయినా, గెలుపైనా, ఓటమైనా..
మీ వెంటే ఉంటా. ప్రస్తుతానికి
నేనేం ఇవ్వలేకున్నా నాతో కలిసి
నడిస్తే స్వేచ్ఛను అందిస్తా. ఇది
తాత్కాలిక ప్రభుత్వమే అయినప్పటికీ ఇది ప్రతి ఒక్క భారతీయుడి ప్రభుత్వం. ప్రజలందరికీ సమానమైన హక్కులు, అవకాశాలు దక్కుతాయి. ఈ ప్రభుత్వం మతపరమైన స్వేచ్ఛకు పూర్తి గ్యారెంటీ ఇస్తుంది. బ్రిటిష్ ప్రభుత్వం పాటించిన కుళ్లు, కుతంత్రాల విభజిత పాలన అసలే ఉండదు. ప్రజలందరి సుఖ సంతోషాలు, శ్రేయస్సు కోసం ఈ ప్రభుత్వం పనిచేస్తుంది

– సుభాష్ చంద్రబోస్



ఆచమనం.. మూఢాచారం కాదు!

ఎసోఫెగస్ అనేది మన గొంతును పొట్టకు కలిపే ఒక ట్యూబ్. ఇది కండరాలతో నిర్మితమై వుండి, ఎప్పుడూ మూసుకునే ఉంటుంది. ఆహారం లోనికి తీసుకునేటప్పుడు మాత్రం తెరుచుకుని మళ్ళీ వెంటనే మూసుకుపోవాలి. అలా మూసుకుని జీర్ణాశయంలో ఉన్న యాసిడ్, ఆహారాలను బయటకు రాకుండా ఆపి రక్షిస్తూ ఉంటుంది. యాసిడ్ బయటకి లీక్ అయ్యి వస్తే దాన్నే మనం ఎసిడిటీ అంటాం. భోజనం చేసే ముందు ఈ ఎసోఫెగస్ సాఫీగా తెరుచుకోవడానికి బ్రాహ్మణులు చేసే "ఆచమనం" అనే పద్ధతిని అందరూ పాటించాలి.

పరిశీలిస్తే ఈ 'ఆచమనం' అనే ప్రక్రియ ఒక శాస్త్రీయ దృష్టితో అలవరచుకున్న ఆరోగ్యకరమైన విధానం అని తెలుస్తుంది. కొందరు అనుకున్నట్టు ఒక మూఢాచారం కాదు. కొంచెం నీరు తీసుకుని ఆహారం మొదలుపెడితే ఎసోఫెగస్‌కి లూబ్రికేషన్ జరుగుతుంది, ఆహారం సాఫీగా పొట్టలోకి జారుతుంది. అంతేనా? అలాగైతే ముందుగా కాస్త నీళ్ళుతాగి భోజనం చెయ్యమని చెప్పచ్చుగా? కేశవ నామాలు దేనికి అని అనుమానం రావచ్చు. ఈ ఆచమనం భోజనం చేసే ముందే కాదు, ఏ పూజచేసేటప్పుడైనా కూడా చేస్తారు. అన్నిటికీ కలిపి ఒకే ప్రాసెస్ ని మనకు నేర్పారు అన్న విషయాన్ని మనం గమనించుకోవాలి. గొంతులో 'ఎసోఫెగస్' ఒక్కటే కాదు. సున్నితమైన శ్వాసనాళము, స్వరతంత్రులు వంటివి అనేకం ఉంటాయి. మంత్రోచ్చారణ చేయడానికి ముందు వాటికి కూడా కొంచెం ఒక నిర్దిష్టపద్ధతిలో వ్యాయామం(వార్మ్ అప్) అవసరం. దానికి భగవన్నామాలతో మొదలు పెట్టమన్నారు. అదీ ఏ నామం పడితే అది అని చెప్పలేదు. కేశవ, నారాయణ, మాధవ అని మాత్రమే అనమన్నారు. ఎందుకంటే, 'కేశవ' నామం గొంతులోనుంచీ వస్తుంది. 'నారాయణ' నామం నాలిక సహాయంతో వస్తుంది. 'మాధవ' నామం పెదాల సహకారంతో వస్తుంది. అంటే నోటిలో అన్ని భాగాలకూ ఒక ఎక్సర్సైజ్ అన్న మాట. మరి నీళ్ళు చేతిలో పోసుకుని నోట్లో ఎందుకు పోసుకోవాలి? ఉద్ధరిణితో నేరుగా నోట్లో పోసుకోవచ్చు కదా! మన చేతిలో ఎప్పుడూ కొంత విద్యుత్తు (స్టాటిక్ పవర్) ఉంటుంది. ఆ చేతితో నీరు పోసుకుని మింగితే, దానితో చేతిలో ఉన్న విద్యుత్తు, నోటిలోకి పొట్టలోకి ప్రవహించి అన్నిటినీ ఉత్తేజపరచి, సమతుల్యం చేస్తుంది. దానితో ఆహారం స్వీకరించడం తేలికవుతుంది. అలాగే కంఠంలో ఉన్న స్వరతంత్రులు కూడా ఉత్తేజితం అవుతాయి. ఇది ఒక దృక్పదం. కొందరు మరొక విధంగా చెప్పవచ్చు. కానీ ఈ విధానంలో ఒక శాస్త్రీయత (మనకి పూర్తిగా అర్థం కాకపోయినా) కనిపిస్తుంది. ఇలాగే ఇంకా మనలో చాలా ప్రశ్నలు సహజంగానే రావచ్చు, వస్తాయి. రావాలి. ఐతే అన్నిటికీ మనకు సమాధానం వెంటనే దొరకకపోవచ్చు. అంటే దాని వెనుకనున్న నాలెడ్జిని మనం కోల్పోయాం. కనుక తిరిగి సంపాదించుకోవాలి అని ప్రయత్నిస్తే, సమాధానాలు అన్నీ దొరుకుతాయి.

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..
సంస్కృతిని కాపాడే లక్ష్యంగా..
మన ఔన్నత్యాన్ని పెంచేలా..
మన ఔచిత్యాన్ని చాటేలా..
తెలుగు చరిత్రలోనే తొలిసారి..
ధర్మం కోసం అక్షర తపస్సు చేస్తూ..
తెలుగు ప్రజల కోసం వస్తున్నది..

"ఋషి తెలుగు దినపత్రిక"

'కురుక్షేత్రం' అన్న పేరుతో..
సంపాదకీయాన్ని తీసుకొస్తున్నది
ఆసక్తి కలిగిన రచయితలు..
ధర్మ పరిరక్షకులు..
ఈ అక్షర యజ్ఞంలో
పాలుపంచుకోవాలని విజ్ఞప్తి.
కురుక్షేత్రం పేజీ కోసం తమ
వ్యాసాలు పంపి
మరింత మందికి జ్ఞానాన్ని
ప్రసాదించాలని వినతి.

కాపాడుకుందాం
మన దేశాన్ని!
మన ధర్మాన్ని!!

సంభాల్ హీరో.. అనుజ్ చౌదరి

సంభాల్ అల్లర్లు దేశవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ అల్లర్లను టీటుగా ఎదుర్కొన్న ఉత్తరప్రదేశ్ పోలీస్ శాఖ ధైర్యసాహసాలనూ కొనియాడాల్సిందే. ముఖ్యంగా శాంతి భద్రతలను కంట్రోల్ చేసిన పోలీస్ అధికారి అనుజ్ చౌదరి గురించి చెప్పుకోవాల్సిందే.



సంభాల్ నిజాలను ప్రపంచానికి చూపించడంలో ఈయన గొప్ప సమయస్ఫూర్తిని ప్రదర్శించారు. సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజంఖాన్‌తో వాదోపవాదాలు జరిగిన సందర్భంగా ఈయన పేరు మార్మోగింది. అందుకే ఈయనను అక్కడి ప్రజలు చుల్‌బుల్ పాండే అని ముద్దుగా పిలుచుకుంటారు. సంభాల్ మసీదు వ్యవహారంలో ఈయన శాంతిభద్రతలను నియంత్రించడంలో కీలకంగా వ్యవహరించారు. అల్లరి మూకలను గుర్తించి కటకటాల్లోకి నెట్టారు. అల్లర్లు చేసిన వారి పోస్టర్లు ముద్రించి, వారి పేర్లు, చిరునామాలు, గుర్తింపులు బహిరంగ ప్రదేశాల్లో ఉంచారు. వారిని గురించి అక్రమ ఆయుధాలు స్వాధీనం చేసుకొని జైలుకు పంపారు. తోటి పోలీస్ అధికారుల్లో ధైర్యం నింపి తోడుగా నిలిచారు. అధికారులకు భద్రత కల్పించి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. పోలీస్ మార్గదర్శకాలను పాటించని ఇమామ్‌కు రూ. 2 లక్షల జరిమానా విధించారు. మసీదులు, మదర్సాల్లో విద్యుత్తు చోరీకి పాల్పడుతున్న కరెంటు దొంగలను పట్టుకున్నారు. ముస్లిం ప్రాంతంలో ఒక దేవాలయాన్ని గుర్తించి, దానిని శుభ్రం చేసి, పూజలు ప్రారంభించి, ఆలయంలోని అక్రమ ఆక్రమణలను ధ్వంసం చేసి, ఆక్రమణకు గురైన బావిని తిరిగి తవ్వి, వీధి మొత్తంలో సీసీటీవీని ఏర్పాటు చేశారు.

వాస్తవానికి.. రెజ్లింగ్ స్టార్ అయిన అనుజ్ చౌదరి.. స్పోర్ట్స్ కోటాలో పోలీస్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. 2002, 2010 జాతీయ క్రీడల్లో రెండు రజత పతకాలను, ఆసియా చాంపియన్‌షిప్‌లో రెండు కాంస్య పతకాలను సాధించారు. 2001లో లక్ష్మణ అవార్డు, 2005లో అర్జున అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి 62 సార్లు ప్రాతినిధ్యం వహించారు. అనంతరం స్పోర్ట్స్ కోటాలో.. 2012 బ్యాచ్‌కి డిప్యూటీ ఎస్పీగా నియమితులయ్యారు. నేరగాళ్లు, మాఫియాపై సింహస్వప్నంలా మారారు. అక్రమ మద్యం వ్యాపారులపై ఉక్కుపాదం మోపారు. ఈయన హనుమాన్ భక్తుడు.

OWNED, PUBLISHED AND PRINTED BY **TIRUMALASHETTY RAMACHANDRA RAO**, PRINTED AT VAIBHAV ART PRINTERS, #11-5-419, RED HILLS, LAKADIKAPOOL, HYDERABAD500004, TELANGANA, PUBLISHED AT 6-1-628/4/7, MARKET ROAD, KHIRATABAD, HYDERABAD-4, TELANGANA EDITOR : **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NUMBER: APTEL/2008/26409, CELL: 9666711515, EMAIL: rhushinews@gmail.com